PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 92 | విజయవాడ, ఆదివారం 2 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 2 November 2025 | Rs

జీవనోపాధులు మెరుగుపర్చేందుకు కృషి

- సిపిఎం బీహార్ మేనిఫెస్టో విడుదల

7

కొత్త ఛాంపియన్ ఎవరో..?

- నేడు భారత్, దక్షిణాఫ్రికా మధ్య టైటిల్ పోరు
- మధ్యాహ్నం 3.00గం॥లకు



8



తిరువనంతపురంలో శనివారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో 'తీవ్ర పేదరిక విముక్త రాష్ట్రం' లక్ష్య సాధనలో నాలుగేళ్ల ప్రస్తావనంపై నివేదికను మళయాళ సుప్రసిద్ధ నటుడు మమ్ముట్టికి అందజేస్తున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్

తీవ్ర పేదరిక విముక్త రాష్ట్రంగా

కేరళ ఘనకీర్తి

ఈ లక్ష్యం సాధించిన దేశంలోనే తొలి, ఏకైక రాష్ట్రంగా అవతరణ

- శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో ముఖ్యమంత్రి విజయన్ ప్రకటన
- లక్ష్య సాధనలో నాలుగేళ్ల ప్రస్థానంపై సమగ్ర వివరణ

తిరువనంతపురం : దేశానికి అనేక అంశాల్లో దిక్సూచిగా నిలిచిన కేరళ..మరో అద్వితీయమైన ఘనఖ్యాతిని తన కీర్తిశిగలో పొందుపర్చుకుంది. దేశంలోనే తీవ్ర పేదరికం నుంచి సంపూర్ణ స్వేచ్ఛను సాధించిన మొట్టమొదటి, ఏకైక రాష్ట్రంగా ఆవిర్భవించింది. కేరళ రాష్ట్ర అవతరణ సందర్భంగా శనివారం ప్రత్యేకంగా నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ మేరకు సగర్వ ప్రకటన చేశారు. ఈ ఏడాది కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని రాష్ట్రానికి నవ శకంగా విజయన్ అభివర్ణించారు. లక్ష్య సాధనలో నాలుగేళ్ల ప్రస్థానాన్ని సమగ్రంగా వివరిస్తూ ఆయన ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ డిక్లరేషన్ అంతా కేవలం 'పబ్లిసిటీ స్టంట్' అని ప్రతిపక్షం చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. 2021లో ప్రస్తుత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ తొలి కేబినెట్ సమావేశంలో తీవ్రమైన పేదరిక నిర్మూలన ప్రాజెక్టు (ఇపిఇపి) అమలు కోసం నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. 'మేం నెరవేర్చగలమని అనుకున్న హామీలే ఇస్తాం. ఏవైతే వాగ్దానం చేశామో వాటిని నెరవేర్చాం." అని ఆయన చెప్పారు. ఆ నిర్ణయం తీసుకున్న రెండు మాసాల్లోగానే తీవ్రమైన పేదరికంలో మగ్గుతున్న కుటుంబాలను గుర్తించే ప్రక్రియ ఆరంభమైందన్నారు. ఇందులో ప్రజల ప్రాతినిధ్యం కూడా చురుకుగా వుందన్నారు. అలాగే స్థానిక సంస్థల ప్రతినిధులు, కుటుంబశ్రీ వర్కర్లు, వలంటీర్లు, అధికారులు అందరూ కూడా చక్కగా సహకరించారన్నారు. స్థానిక సంస్థ స్థాయిలో డేటా సేకరించడం ద్వారా గుర్తించబడిన కుటుంబాలను పరిశీలించి, వార్డు కమిటీలు సిఫార్సు చేశాయి. ఆ కుటుంబాలను మరోసారి తనిఖీ చేసి ముసాయిదా జాబితాను సిద్ధం చేశాం. ఈ జాబితాను గ్రామ సభలకు అందచేశాం. అక్కడ నుండి మిగతా 7లో

పలాసలో ఘోరం

• కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట • 9 మంది దుర్మరణం

- మృతుల్లో 8మంది మహిళలు ఒక బాలుడు
- ఏర్పాట్ల వైఫల్యమే కారణం
- ప్రధాని, సిఎం దిగ్భ్రాంతి



ఆలయానికి తరలివచ్చిన యాత్రికులు (ఇన్‌సెట్‌లో) మృతదేహాలు

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

నాన్నా గుడికి వెళ్లొస్తా.. అంటూ చెప్పి వెళ్లిన నిఖిల్ ఇక తిరిగి రాలేదు. దైవదర్శనం చేసుకొని వస్తానని చెప్పిన దువ్వు రాజేశ్వరి ప్రాణాలు గుడి వద్దే గాలిలో కలిసిపోయాయి. మరికొద్ది సేపట్లో దర్శనం పూర్తి చేసుకుని తిరుగుప్రయాణం అవుదామనుకున్న వారికి మృత్యుపాశం ఎదురవుతుందని తెలీదు. వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లిన తమ కుమారుడికి ఇదే చివరి దర్శనమవుతుందని ఆ తల్లిదండ్రులు ఊహించలేదు. శ్రీకాకుళం జిల్లా పలాస - కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాటలో మృతుల ఉదంతాలివి!

ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. వారిలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో మరణించారు. మృతుల్లో ఎనిమిది మంది మహిళలు, 13 ఏళ్ల బాలుడు ఉన్నారు. 16 మంది గాయపడ్డారు. వీరంతా శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారే. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై ప్రధాని, కేంద్ర హోంమంత్రి, సిఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్తీక ఏకాదశి సందర్భంగా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 15 వేల మందికిపైగా సందర్శకులు పోటెత్తారు. వెంకటేశ్వరస్వామి దర్శనానికి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. మొదటి అంతస్తులో ఉన్న ఈ గుడిలోకి వెళ్లడానికి, రావడానికి ఒకే మెట్ల మార్గం ఉంది. దర్శనం కోసం జనం కిక్కిరిసిపోవడంతో తోపులాట చోటుచేసుకుంది. నిలదొక్కుకోవడానికి రెయిలింగ్‌ను పట్టుకున్నారు. ఇది బలహీనంగా ఉండడంతో కూలిపోయింది. దీంతో, దాన్ని పట్టుకున్న వారంతా కింద పడిపోయారు. మెట్టుపై ఉన్న వారంతా వారిపై పడ్డారు. ఈ ఘటనతో భయాందోళనకు గురై యాత్రికులు పరుగులు తీయడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. 16 మంది గాయపడ్డారు. వారిలో నందిగాం మండలం రౌతుపురానికి చెందిన బాకి కళావతి, మందస మండలం బెల్లుపట్టియాకు చెందిన దువ్వు కుమారితోపాటు మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వీరు ముగ్గురు ఐసియులో చికిత్స పొందుతున్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో శవపంచనామా అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు, సదుపాయాలు లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని యాత్రికులు తెలిపారు. విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్‌జెట్టి పలాస ప్రభుత్వాస్పత్రిని సందర్శించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గౌతు శిరీష, మిగతా 7లో

మృతులు వీరే..

పేరు	గ్రామం
ఈదురి చిన్నమ్మ (50)	రామేశ్వరం, టెక్కలి
రాపాక విజయ (48)	పిట్టలసారి, టెక్కలి
మురిపింటి నీలమ్మ (60)	దుక్కవానిపేట, వజ్రపుకొత్తూరు
దువ్వు రాజేశ్వరి (60)	బెల్లుపట్టియా, మందస
రూప (40)	గుడ్డుభద్ర
బృందావతి (62)	మందస
చిన్ని యశోదమ్మ (56)	శివరాపురం, నందిగాం
లోట్ల నిఖిల్ (13)	బెంకిలి, సోంపేట
డొక్కర అమ్ముడమ్మ (50)	పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

11 మంది అంతర్జాతీయ సైబర్ నేరస్తుల అరెస్టు

- రూ.357 కోట్లు ఫ్రీజ్, రూ.7 లక్షలు స్వాధీనం
- ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, ఎటిఎం కార్డులు చూపుతున్న ఈగల్ చీఫ్ రవికృష్ణ తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విదేశాల్లో నెట్‌వర్క్‌ను విస్తరించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న పలు రాష్ట్రాలకు చెందిన నేరస్తుల ముఠాను అరెస్టు చేసినట్లు ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ, ఏలూరు ఎస్‌పి కె ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నేరాలు, రికవరీ, అరెస్టుల గురించి వివరించారు. ఏలూరులో నమోదైన సైబర్ నేరం కేసులో అంతర్జాతీయ నేరస్తుల ముఠాలో 11 మందిని ఇప్పటి వరకు అరెస్టు చేసినట్లు తెలిపారు. ప్రధాన నిందితులైన పూనమ్ ప్రవీణ్ సోనావానే (ముంబయి), సుచింద్రశర్మ (ఉత్తరప్రదేశ్), నితిన్ మిశ్రా, హర్షిత్ మిశ్రా, అభిషేక్ కాశ్యప్, గోపాల్ యాదవ్, సందీప్ అలోని (బ్యాంకు ఉద్యోగి), సందీప్‌వక్ పంజర్ (కానిస్టేబుల్) ఉన్నారన్నారు. ఈ ముఠా ఢిల్లీ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, గోవా, కాంబోడియా, నేపాల్ చైనా, సింగపూర్, యుఎస్‌ఎలలో నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు దర్యాప్తులో తేటతెల్లమైందన్నారు. ఈ ముఠా నుంచి ఇప్పటి వరకు రూ.7 లక్షలు నగదు, 150 బ్యాంకు ఖాతాలను స్వాధీనం చేసుకుని, రూ.357 కోట్లు నగదును బ్యాంకుల్లో ఫ్రీజ్ చేసినట్లు వెల్లడించారు. సైబర్ నేరస్తులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక టీమ్‌లు పనిచేశాయని, కేసు దర్యాప్తు పూర్తయితే ఇంకా లోతైన విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. సైబర్ స్కిల్స్‌పై నూతనంగా రిక్రూట్‌మెంట్ అయిన 6 వేలకు పైగా కానిస్టేబుల్స్‌కు 6 నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. 26 జిల్లాల్లో త్వరలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందన్నారు.

కేసును ఛేదించింది ఇలా..

ఏలూరుకు చెందిన 66 ఏళ్ల మహిళకు (న్యాయవాది) పోలీస్ ఆఫీసరునంటూ ఒకరోజు వీడియో కాల్ వచ్చింది. ఆమె ఆధార్ కార్డు ఓ నేరంలో వాడారని, మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేయాలంటూ వారెంట్ చూపిస్తూ నేరస్తులు భయపెట్టారని పోలీసులు తెలిపారు. 72 గంటలపాటు వీడియో కాల్‌లోనే ఉంచడంతో పాటు. రూ.51.90 లక్షలు వెరిఫికేషన్ పేరుతో ట్రాన్స్‌ఫర్ చేయించారని, బాధితురాలు రాత్రి సమయంలో ఏలూరు ఎస్‌పికి మెసేజ్ ద్వారా తెలపడంతో వెంటనే 220/2025 కింద కేసు నమోదు చేసి నేరస్తుల కోసం ప్రత్యేకంగా బృందాలు పంపినట్లు ఈగల్ ఐజి రవికృష్ణ, ఏలూరు ఎస్‌పి కె ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అంటూ నేరస్తులు కాంబోడియా, నేపాల్‌కు చెందిన నెంబర్స్‌తో కాల్స్ చేస్తారని, నకిలీ పోలీస్ ఐడిలు, వారెంట్లు చూపుతున్నారని పేర్కొన్నారు. నిరంతరం వీడియో కాల్‌లో ఉంచి కుటుంబంతో మాట్లాడనీయకుండా చేయడం, సేఫ్ అకౌంట్స్ పేరుతో మ్యూట్ అకౌంట్స్‌కు డబ్బు పంపించడం, ఎపికె యాప్స్ ద్వారా క్రిప్టో కరెన్సీకి (యుఎస్‌డిటి/ సిఎన్‌వై) మార్చుతున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు.


ఫిర్యాదులు ఇలా...

పోలీస్ పేరుతో వీడియో కాల్స్, వారెంట్స్ చూపడం, డబ్బు అడుగుతూ మోసాలకు పాల్పడుతున్న ముఠాల సమాచారాన్ని 1930 లేదా www.cyber crime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇతరులకు బ్యాంకు అకౌంట్స్ అద్దెకివ్వొద్దని వారు సూచించారు. కేసు దర్యాప్తులో పాల్గొన్న ప్రత్యేక పోలీస్ బృందాలకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు.

నేడు నాలుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద ఎవరూ నిలబడరాదని సూచించింది. ఎగువన పడుతున్న భారీ వర్షాలకు కృష్ణానది వరద ప్రవాహం కొన్ని రోజులు హెచ్చుతగ్గులుగా ఉండే అవకాశం ఉంది. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 1,67,175 క్యూసెక్కులు ఉంది. నదీ పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.



ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

సంక్షేమంతో పాటు

పునర్నిర్మాణం

- బటన్‌నొక్కుతూ పరదాల పాలన చేయడం లేదు
- సాంకేతిక పరిజ్ఞానంతో మొంథా నష్టాన్ని నివారించాం
- పెద్దన్నవారిపల్లి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి- కదిరి టౌన్, తలుపుల

ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పేదల ఆర్థిక సంక్షేమానికి తోడ్పాటునిస్తూ సామాజిక పింఛన్లను ప్రతి నెలా ఒకటవ తేదీన లబ్ధిదారుల తలుపు తట్టి అందజేస్తున్నామని పునరుద్ఘాటించారు. 'పేదల సేవలో' భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం పర్యటించారు. ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులను స్వయంగా కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 94 శాతం స్ట్రైక్ రేట్‌తో టిడిపి కూటమిని గెలిపించిన ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పాలన సాగిస్తున్నట్లు తెలియజేశారు. ఆర్థిక లోటులో ఉన్నా సంక్షేమానికి ఆటంకం రాకుండా లబ్ధిదారులకు సాయం చేస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల ప్రజలనూ కలుసుకోవాలన్న ఉద్దేశంతో ప్రతి నెలా ప్రజల వద్దకు వస్తున్నానని అన్నారు. బటన్ నొక్కుతూ, పరదాలు కట్టుకుని, ఇంట్లోనే కూర్చొని పాలన చేయవచ్చుని, కాని తాము అలా చేయమంటూ గత ప్రభుత్వానుద్దేశించి విమర్శించారు. గతంలో హెలికాప్టర్‌లో వచ్చినా కింద చెట్లు నరికివేసిన పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. ఒకటవ తేదీ మధ్యాహ్నం మూడు గంటల్లోపు లబ్ధిదారులందరికీ పింఛను సొమ్మును అందజేస్తున్నామని, ఎన్ని ఇబ్బందులున్నా పింఛన్ల పంపిణీని వాయిదా వేయడం లేదన్నారు. సాంకేతిక సాయంతో ముందస్తుగా మొంథా తుపానును గుర్తించి ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడంతో నష్ట తీవ్రతను తగ్గించామని తెలిపారు. తుపాను వల్ల రూ.5,244 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని, ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, తుపాను వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తుపాను నష్టాన్ని అంచనా వేసి కేంద్రానికి నివేదికలు అందజేశామని తెలిపారు. అభివృద్ధి పరంగానూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, అందులో భాగంగా విశాఖలో గూగుల్ సంస్థ రూ.1.33 లక్షల కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని, పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వంపై విశ్వాసంతోనే కియా పరిశ్రమ ఉమ్మడి అనంతపురం జిల్లాకు వచ్చిందన్నారు. అంతకు ముందు శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఘటనలో తొమ్మిది మంది మృతికి సంతాప సూచకంగా సిఎంతో పాటు, నాయకులు, ప్రజలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, ఎంపి పార్థసారథి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్‌విఎం 3 - ఎం5 ప్రయోగం

- ప్రారంభమైన కౌంట్‌డౌన్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా):



షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్‌విఎం3- ఎం5 రాకెట్ ద్వారా సిఎంఎస్-03 సమాచార ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు రంగం సిద్ధమైంది. ఎంఆర్‌ఆర్ సమావేశం నిర్వహించి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) చైర్మన్ ఈఎస్.పద్మ కుమార్ బృందానికి అప్పగించారు. ఆయన ఆధ్వర్యంలో లాంచ్ రిహార్సల్స్ నిర్వహించి శనివారం సాయంత్రం 5.26 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభించారు. ఇది 24 గంటలు కొనసాగిన తరువాత ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు 4400 కిలోల బరువు కలిగిన సిఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహం నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగం ప్రారంభమైన అనంతరం 16.09 నిమిషాల్లో నిర్దేశించిన కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు.

ఊరు వల్లకాడు చేస్తారా?

- బల్క్ డ్రగ్ ఏర్పాటుపై వి శ్రీనివాసరావు ఆగ్రహం
- మత్స్యకారుల పోరాటానికి వామపక్ష పార్టీల సంపూర్ణ మద్దతుగా నేతల పర్యటన



మత్స్యకారుల దీక్షకు మద్దతుగా కూర్చున్న సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, జి.ఈశ్వరయ్య తదితరులు

ప్రజాశక్తి- నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేసి ఊరును స్మశానంగా మార్చాలనుకుంటున్నారా? అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ చేపట్టిన మత్స్యకారుల ఉద్యమానికి సంఘీభావంగా వామపక్ష నేతలు శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్స్యకారుల ఘోష ప్రభుత్వానికి వినిపించలేదా? అని ప్రశ్నించారు. రాజయ్యపేట గ్రామాన్ని దిగ్బంధంలో ఉంచి బలవంతంగానైనా బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, దీనిని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని అన్నారు. హెటిరో కంపెనీ కాలుష్యంతో రాజయ్యపేట మత్స్యకారులు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, కంపెనీ వ్యర్థ రసాయన జలాలను శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి వదులుతుండడంతో మత్స్య సంపద ఉత్పత్తి తగ్గిపోయి వేట సాగక ఉపాధి కోల్పోయి మత్స్యకారులు రోడ్డున పడ్డారని, కంపెనీ కాలుష్యం కారణంగా అనేక రకాల ప్రాణాంతక వ్యాధుల బారిన పడి ఇప్పటికే 52 మంది చనిపోయారని, దీన్నిబట్టి పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో ప్రభుత్వం అర్థం చేసుకోవాలని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే నేలబాంబు పెట్టినట్లేనని పేర్కొన్నారు. రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసిన చోట జరుగుతున్న పరిణామాలపై సర్వేలు చేశారా? అని ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతిలోనే పర్యావరణ శాఖ ఉందని, ఆయన ఎప్పుడైనా కాలుష్య నియంత్రణ చర్యలపై సర్వేలు చేపట్టారా? అని వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. కాకినాడ జిల్లా తొండంగి ప్రాంతంలో బల్క్ డ్రగ్‌ను ఆ ప్రాంత ప్రజలు అడ్డుకుంటే ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారని, ఇక్కడ ప్రజలు లేరా? అని ప్రశ్నించారు. తామంతా ఇక్కడికి వస్తుంటే పోలీసులు అనేక చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు చేసి పంపించారని, ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగితే హోం మంత్రి అనితను మత్స్యకారులు అడ్డగించారని మిగతా 7లో

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధేది?

- వసతి గృహాల్లో సౌకర్యాలు అధ్వానం
- తాగునీటి సరఫరాలో లోపాలను పట్టించుకోని అధికారులు

3

'స్మార్ట్ మీటర్' ప్రక్రియ వేగవంతం

- డిస్కమ్‌ల సిఎమ్‌డిలకు సిఎస్ విజయానంద్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ, వాణిజ్య, అధిక వినియోగ గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసే ప్రక్రియను వేగవంతం చేయాలని డిస్కమ్‌ల సిఎమ్‌డిలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. ఆర్‌డిఎస్‌ఎస్ కింద ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్ ఇన్‌స్టాలేషన్ పురోగతిపై శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. 100 శాతం ఫీడర్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ మీటరింగ్‌ను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. డిస్కమ్‌లు ఇప్పటి వరకు 17.96 లక్షల స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశాయని, మంజూరైన మీటర్లలో ఇవి సుమారు 45 శాతమని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో గరిష్టంగా ఎంతమేర చేయగలరో అంతమేర స్మార్ట మీటర్ రోలౌట్ సాధించేందుకు మరింత కృషి చేయాలని ఆదేశించారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలో ప్రీపెయిడ్ మీటర్ల పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇన్‌స్టాలేషన్లు విజయవంతంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో ప్రీపెయిడ్ మీటర్లను విస్తరింపజేయాలని చెప్పారు. కొత్త గ్రూప్ వాలెట్ మెకానిజం ద్వారా బకాయిలను సమయానుకూలంగా క్లియర్ చేయడంతోపాటు, విద్యుత్ వినియోగాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఫైనాన్స్ కార్పొరేషన్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖతో డిస్కమ్‌లు సమన్వయం చేసుకుని ఆర్‌డిఎస్‌ఎస్ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. నాన్ కమ్యూనికేటింగ్, నో మోడెమ్ ఫీడర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఫీడర్ ఇంటిగ్రేషన్లను వేగవంతం చేయాలని, తద్వారా రాష్ట్రం పూర్తి నెట్‌వర్క్ పారదర్శకత, ఆపరేషన్ సామర్థ్యాన్ని సాధించగలుగుతుందని సూచించారు. అన్ని డిస్కమ్‌లలో సమాచార విశ్వసనీయత 90 శాతానికి కొనసాగించాలని, ఇది రియల్ టైమ్ మానిటరింగ్, సమర్ధవంతమైన విద్యుత్ వ్యవస్థ నిర్వహ ణకు కీలకమని తెలిపారు. ఈ సమావేశంలో మూడు డిస్కమ్‌ల సిఎమ్‌డిలు ఎల్ శివశంకర్, ఐ పృథ్వీతేజ్, పి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేరళ అంతర్జాతీయ సదస్సుకు బలరాం

- స్వతంత్ర అధ్యయన పరిశోధనా సంస్థ ఆహ్వానం

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిగోదావరి)

వ్యవసాయ రంగం మార్పులపై నవంబర్ ఆరు నుంచి తొమ్మిది వరకు కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర రైతు నాయకులు బి.బలరాం హాజరు కానున్నారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న స్వతంత్ర అధ్యయన పరిశోధనా సంస్థ ఆహ్వానం మేరకు అంతర్జాతీయ సదస్సుకు హాజరవుతున్నట్లు బలరాం తెలిపారు. ఈ సదస్సును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాల నుంచి, పలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాలు, విధానపరమైన అధ్యయన సంస్థల నుంచి శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు, సాంకేతిక నిపుణులు ప్రభుత్వ, ప్రయివేటు సహకార సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నట్లు చెప్పారు. 2003లో హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ నేతృత్వంలో ఈ ప్రముఖ అధ్యయన పరిశోధనా సంస్థ ఏర్పడిందని, దేశ ఆర్థిక వ్యవసాయ సహకార సంబంధిత విషయాలపై ఇప్పటికీ 12 రాష్ట్రాల్లో విస్తృత అధ్యయనాలు నిర్వహిస్తోందని చెప్పారు.

సికింద్రాబాద్ క్రూ డిపోను యథాస్థానంలో కొనసాగించాలి

- సిఐటియు ఆలిండియా అధ్యక్షులు కె హేమలతకు ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సౌత్‌కోస్ట్ రైల్వే ఏర్పాటులో భాగంగా విజయవాడ కేంద్రంగా ఉన్న సికింద్రాబాద్ డివిజన్ క్రూ డిపోను ప్రస్తుతం ఉన్న విధంగానే యథా స్థానంలో కొనసాగించేలా రైల్వే బోర్డు, రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సిఐటియు ఆలిండియా అధ్యక్షులు కె హేమలతకు సికింద్రాబాద్ డివిజన్ ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ) నాయకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని క్రూ లాబీ కేంద్రంగా పనిచేస్తున్న 500 కుటుంబాలకు పైగా ఉన్న రన్నింగ్ సిబ్బంది ఇక్కడే నివాసం ఉంటున్నారన్నారు. విజయవాడలో శనివారం ఆమెను కలిసిన వారిలో ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ గురుమూర్తి, విజయవాడ బ్రాంచ్ కార్యదర్శి కె రాజేష్‌కుమార్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, వివిఎల్ నరసింహులుతో కూడిన ప్రతినిధి బృందం సభ్యులు ఉన్నారు.

సెలవుల ప్రకటనలో హేతుబద్ధత ఉండాలి: ఎపి ఛాంబర్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖల కింద ప్రకటిస్తున్న సెలవులు హేతుబద్ధంగా ఉండాలని, దీనికోసం అన్ని డిపార్టుమెంట్లను సమన్వయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఎపి ఛాంబర్స్ కోరింది. ఈ మేరకు ఛాంబర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం కార్మికశాఖ, ఫ్యాక్టరీల చట్టం కింద, సాధారణ పరిపాలనశాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేర్వేరుగా సెలవులను ప్రకటిస్తున్నాయని తెలిపారు. దీనివల్ల సెలవుల సంఖ్య తేదీల్లోనూ వ్యత్యాసాలు వస్తున్నాయని వివరించారు.

మొంథా తుపాను రక్షణ చర్యల్లో

టీమ్ స్పిరిట్.. టీమ్ వర్క్

- 137 మందికి సిఎం సన్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



మొంథా సైక్లోన్ ఫైటర్స్‌తో సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి అనిత తదితరులు

మొంథా తుపానును టీమ్ స్పిరిట్‌తో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. శనివారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో 137 మంది మొంథా తుపాను ఫైటర్లకు సిఎం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను నష్టాన్ని తగ్గించేందుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అద్భుతంగా పనిచేశారని కితాబిచ్చారు. ఈ అనుభవాన్ని మున్ముందు విపత్తుల కార్యాచరణ కోసం మాన్యువల్‌గా రూపొందించాలని అన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నందనే తుపాను నష్టాన్ని తగ్గించామని చెప్పారు. రాష్ట్రంలో రాయలసీమకు కరువు, కోస్తాంధ్రకు తుపాను సమస్యలు ఉన్నాయని తెలిపారు. సమర్ధనీటి నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణంతో కరువు లేకుండా చేశామని పేర్కొన్నారు. గతంలో హరికేన్ వచ్చిన సమయంలో ఉభయగోదావరి జిల్లాల్లో పదిరోజుల్లో సాధారణ పరిస్థితి తీసుకొచ్చామని చెప్పారు. ఈసారి మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు అనుభవం ఉన్న అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. వారికి టెక్నాలజీ సపోర్టు ఇచ్చామని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మోడల్స్ ద్వారా తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నామని వివరించారు. డ్రోన్ సాయంతో బాధితులను గుర్తించి వరదలో కొట్టుకుపోతున్న వారిని కాపాడినట్లు తెలిపారు. 602 డ్రోన్లు ముందుగానే సిద్ధం చేసుకున్నామని, ఎస్‌పిఓ తయారు చేయించి శాటిలైట్లు, డ్రోన్లు, సిసిటివి కెమెరాల ద్వారా ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేసి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయికి అలెర్టులు పంపించామని చెప్పారు. ముందస్తు జాగ్రత్తగా కాలువల పూడికలు, అడ్డంకులు తొలగించామని వివరించారు. సిఎస్ నుండి గ్రామస్థాయి వరకూ అందరూ సమన్వయంతో పనిచేశారని సిఎం పేర్కొన్నారు. ఇటువంటి సమయంలో సమర్థవంతంగా పనిచేసిన వారిని గుర్తించి అభినందనలు తెలిపామని, ఇది వారికి ప్రోత్సాహాన్ని ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలోనూ మైకుల ద్వారా ప్రచారం చేశామని, త్వరలో రాజధాని నుండే గ్రామస్థాయి వరకూ హెచ్చరికల వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ విజయానంద్, మంత్రులు అనిత, దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, డోల బాలవీరాంజనేయస్వామి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న శ్రీనివాసరావు

పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనకాపల్లి (అనకాపల్లి జిల్లా)

విజయవాడ పుస్తక మహోత్సవ ఆధ్వర్యాన రాష్ట్ర సాంస్కృతిక శాఖ జిల్లా గ్రంథాలయ పరిషత్తు సహకారంతో నిర్వహించే పుస్తక మహోత్సవాన్ని అనకాపల్లి వాసులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. పుస్తక స్టాళ్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... పబ్లిషర్స్‌కు చెందిన అందరి పుస్తకాలను సేకరించి ఎగ్జిబిషన్ ఉంచడం మంచి పరిణామమన్నారు. ఎల్‌కెజి నుంచి పిహెచ్‌డి చేసే విద్యార్థులందరికీ ఉపయోగపడేలా ఎగ్జిబిషన్ ఉందన్నారు. పుస్తకాలు చదవడం ద్వారానే విద్యార్థుల వ్యక్తిత్వం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే ఖర్చుల్లో పుస్తకాలు కూడా ఒక భాగంగా కావాలన్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్ అన్ని జిల్లాల్లో నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయడ్డారు.

ప్రైవేట్ ఆలయమయితే రక్షణ ఇవ్వరా?

- తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రభుత్వం యత్నం
- ఇద్దరు పోలీసులతో బందోబస్తుపై నిరసన

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

పలాస-కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనలో తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేస్తోంది. ప్రైవేట్ వ్యక్తి నిర్మించిన ఆలయంలో ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోవడం విచారకరమంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ముందుగానే పోలీసులకు చెప్పి ఉంటే సందర్శకులను క్యూలైన్లల్లో నియంత్రించే అవకాశం ఉండేదంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నుంచీ ఇదే తరహా ప్రకటన వచ్చింది. జిల్లా ఎస్‌పి కె వి మహేశ్వరరెడ్డి కూడా మీడియాకు అదే విషయం చెప్పారు. వెంకటేశ్వర దేవాలయా నికి యాత్రికుల రాకపై తమకు సమాచారం లేదని పోలీసులు చెప్పడంలో వాస్తవం లేదని స్థానికులు చెబుతున్నారు. యాత్రికులను నియంత్రించడానికి ఇద్దరు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. పైగా దేవాలయం విశిష్టతపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం సాగడం...కార్తీకమాసం కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చారు. గత నెల 25న శనివారం సందర్భంగా దేవాలయానికి రెండు వేల మంది దర్శనానికి వచ్చినట్లు సమాచారం. ప్రైవేట్ ఆలయం పేరుతో ప్రభుత్వం, పోలీసుశాఖ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సర్కారు చూస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో తిరుపతి, సింహాచలం ఆలయాల్లో తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నా ప్రభుత్వం కళ్లు తెరవకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై పోలీసుల దాష్టీకం

- 13 మంది అరెస్టు, విడుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను ఈడ్చుకెళ్తున్న పోలీసులు

విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలంటూ ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై పోలీసులు దాష్టీకానికి పాల్పడ్డారు. జుత్తు పట్టుకుని రోడ్డుపై లాక్కెళ్లి వ్యానులో ఎక్కించారు. ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అధిక ఫీజులను నియంత్రించాలని, విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న యాజమాన్య ప్రతినిధి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆ కళాశాల ఎదుట శాంతియుతంగా విద్యార్థులు ధర్నా చేశారు.

వన్‌టౌన్ సిఐ, ఎస్‌ఐ పోలీస్ సిబ్బందితో అక్కడకి వచ్చి ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల జుత్తు పట్టుకుని రోడ్డు మీదకి ఈడ్చుకెళ్లారు. దుర్భాషలాడుతూ లాక్కెళ్లి, వ్యానులోకి ఎక్కించారు. ఈ ఘటనలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు రవికుమార్ చేతికి గాయమైంది. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, డి రాముతో సహా 13 మందిని పోలీసులు అరెస్టు చేసి, వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. ఆ తరువాత వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పోలీసుల తీరుపై ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం అదనంగా ఫీజులు వసూలు చేయడంపై అడగడమే నేరమా? అని ప్రశ్నించారు. భవనం నిర్మాణంలో ఉండగా తరగతులు నిర్వహించడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకునే వరకూ పోరాటం సాగిస్తామని స్పష్టంచేశారు.



డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యాలయంలో పతాకావిష్కరణకు హాజరైన నేతలు

డ్రగ్స్, నిరుద్యోగం అంతం.. డివైఎఫ్‌ఐ పంతం

- ఆవిర్భావ సభలో రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్రగ్స్, నిరుద్యోగం అంతం డివైఎఫ్‌ఐ పంతం అని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి రామన్న తెలిపారు. డివైఎఫ్‌ఐ 46వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా విజయవాడలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం జెండాను రామన్న ఆవిష్కరించారు. దేశంలో యువతి, యువకుల అభ్యున్నతి, ఐక్యత కోసం కృషి చేస్తూ వారిలో దేశభక్తి భావాలు పెంచి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో 1980లో డివైఎఫ్‌ఐ ఏర్పడిందని వివరించారు. నాటి నుంచి యువతరం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతోందని తెలిపారు. సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న మాదకద్రవ్యాలు, మద్యం వినియోగం, అత్యాచారాలు వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించిందన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. దేశంలో అసమానతలకు కారణమైన ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నా.. ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెద్దపెద్ద పరిశ్రమలు వస్తున్నట్లు కూటమి ప్రభుత్వం భ్రమలు కల్పిస్తుందని, పేదల, ప్రభుత్వ భూములను పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీలకు కొల్లగొట్టేందుకు ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ విడుదల చేయాలని, స్థానిక పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో యువత సమస్యలపై పెద్దయెత్తున పోరాడేందుకు డివైఎఫ్‌ఐ సిద్ధంగా ఉందన్నారు. ఆ సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కెవిపిఎస్ ఉపాధ్యక్షులు జి క్రాంతికుమార్, డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కె ప్రసన్నకుమార్, విజయవాడ నగర నాయకులు ఎన్ కృష్ణ, బసవ, సురేష్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమత కళాశాల వద్ద ఉద్రిక్తత

- సాయితేజ ఆత్మహత్యపై విద్యార్థులు, కుటుంబ సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ ఎంవిపి కాలనీ సమత కళాశాల విద్యార్థి మృతిపై విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అధ్యాపకురాలి వేధింపుల కారణంగానే తమ కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు నిరసన చేపట్టారు. గేట్లు తోసుకుంటూ సాయితేజ కుటుంబ సభ్యులు, విద్యార్థులు ముందుకెళ్లడంతో ఆందోళన కారులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పే వరకు కదిలేది లేదని రహదారిపై బైఠాయించారు. ఇదే సమయంలో సమతా కాలేజీ బిల్డింగ్‌పైకి ఎనిమిది మంది విద్యార్థులు ఎక్కారు. న్యాయం జరగకపోతే బిల్డింగ్‌పై నుండి దూకేస్తామని బెదిరించారు. బిల్డింగ్ పైకి ఎక్కిన వారిలో విద్యార్థి సాయి తల్లి న్యాయం జరిగింది కిందకు రారా.. అని కేకలు వేస్తూ కుప్పకూలిపోయారు. రోడ్డు మీద విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. సాయితేజ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసి 24 గంటలు గడిచినా మహిళా అధ్యాపకురాలిని అరెస్ట్ చేయలేదని, యాజమాన్యం ఒత్తిడితో పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళా అధ్యాపకురాలిని ఇప్పటికే సస్పెండ్ చేశామని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం సాయితేజ మృతదేహాన్ని తీసుకునేందుకు కుటుంబీకులు నిరాకరించారు. అధ్యాపకురాలిని అరెస్టు చేసే వరకూ తీసుకోబోమంటూ స్పష్టంచేశారు. అనంతరం కళాశాలలో చర్చలు జరిగాయి. రూ.10 లక్షలు నగదు, సాయితేజ చెల్లి, తమ్ముడిని చదివించేందుకు కళాశాల యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించారు. బిల్డింగ్‌పైకి ఎక్కిన విద్యార్థులు కిందకు దిగారు.



భారతీయులపై అమెరికా నిందలు శోచనీయం

- మోడీ, చంద్రబాబు మౌనం అవమానకరం
- సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమెరికాలో నివసిస్తున్న భారతీయులపై నిందలు మోపుతూ అమెరికా లేబర్ డిపార్టుమెంట్ ఎక్స్‌లో ప్రకటన విడుదల చేయడం శోచనీయమని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్1బి వీసా దుర్వినియోగం అవుతుందన్న నెపంతో భారతీయ విద్యార్థులు ఉద్యోగులపై విద్వేషం రెచ్చగొడుతున్నారని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. తీవ్ర జాతీయ ఉన్మాదానికి ట్రంప్, ఆయన అనుచరులు ఆజ్యం పోస్తున్న తీరు గర్హనీయమన్నారు. ప్రాజెక్టు ఫైర్‌బాల్ పేరిట లేబర్ విధానం ఆడిట్ నిర్వహిస్తూ మరోవైపు భారత్‌పై విషం కక్కడం శోచనీయమన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థలో తీవ్ర సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో దాన్ని పరిష్కరించుకోవడానికి బదులు అమెరికా యువత భారతీయులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడం అంతర్జాతీయ సౌహార్ధతకు భంగం కలిగిస్తుందని తెలిపారు. ఇంత జరుగుతున్నా ప్రధానిగానీ, ముఖ్యమంత్రిగానీ స్పందించకపోవడం అవమానకరమని పేర్కొన్నారు. మౌనంగా ఉండటం అంటే లక్షలాది మంది భారతీయ విద్యార్థులకు, ఉద్యోగులకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ట్రంపు పదేపదే ఆత్మగౌరవంపై దెబ్బకొడుతున్నా మోడీ చంద్రబాబు మౌనంగా ఉండటం సరికాదని పేర్కొన్నారు. చంద్రబాబు చొరవ తీసుకుని భారతీయ విద్యార్థులు, ఉద్యోగులకు తగిన భద్రత, భరోసా కల్పించేందుకు అమెరికా ప్రభుత్వంతో, మోడీ ప్రభుత్వం ద్వారా రాయబారం నెరపి తక్షణం ఉపశమనం కల్పించాలని సిపిఎం డిమాండ్ చేసింది. అమెరికా లేబర్ డిపార్టుమెంటు ఈ యాడ్‌ను ఉపసంహరించుకునేటట్లు ఒత్తిడి తేవాలని కోరింది.



ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలిస్తున్న వి. శ్రీనివాసరావు తదితరులు

నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలి

- ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించిన వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి -అనకాపల్లి

మొంథా తుపాను వల్ల అనకాపల్లి జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట, ఆస్తినష్టం సంభవించిందని, నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా కట్టి బాధితులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, గంటా శ్రీరాం తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తుమ్మపాల గ్రామంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఇంతవరకు పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని ఎందుకు అంచనా వేయలేదని ప్రశ్నించారు. రైతులకు వంద శాతం పంట నష్టం జరిగినప్పటికీ అధికారులు పంట నష్టం నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. అనకాపల్లి మండలంలో వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, ఊడేరు, దిబ్బపాలెం, మాటూరు, జగన్నాథపురం, మెట్టపాలెం, సుందరయ్యపేట, కుంచంగి, రొంగలి వానిపాలెం, పిసినికాడ, అనకాపల్లి, శంకరం, గొలగాం తదితర గ్రామాల్లో సుమారు నాలుగు వేల ఎకరాల్లో వరి, చెరకు, కూరగాయలు, సరుగుడు, ఇతర పంటలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయని తెలిపారు.

పేదలు, దళితుల పట్ల నిరంకుశత్వం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు



చర్చావేదికలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేదలు, దళితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ చేయడం, 9/77 చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి వ్యతిరేకంగా శనివారం ఏలూరులో అన్నే వెంకటేశ్వరరావు భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అధ్యక్షతన రాష్ట్రస్థాయి చర్చా వేదిక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని త్వరలోనే తొలగించి రాష్ట్ర ప్రజలకు తీపికబురు చెబుతామని అక్టోబర్ 24న జరిగిన మంత్రివర్గ ఉపసంఘం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు, దళితులకు ఉపయోగపడే అసైన్‌మెంట్ భూములను అభివృద్ధి పేరుతో బలవంతంగా భూసేకరణ చేస్తూ పేదల చేతుల్లో ఉన్న ఎకరా, అరెకరా భూములను లాగేసుకోవడం దుర్మార్గమన్నారు. 2023లో అప్పటి వైసిపి ప్రభుత్వం గడిచిన 50 ఏళ్లలో అసైన్డ్ భూములు పొందిన పేదలు 20 ఏళ్లు అనుభవించిన తర్వాత అమ్ముకోవచ్చు, ఈ భూములను ఎవరైనా కొనుగోలు చేయొచ్చని 9/77 చట్టాన్ని సవరించడానికి ప్రయత్నిస్తే అందుకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక, దళిత సంఘాలు, ఇతర ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాడిన ఫలితంగా ప్రభుత్వం వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. నేడు టిడిపి కూటమి ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయడానికి వ్యవసాయ కార్మిక సంఘం పూనుకుందన్నారు. రానున్న కాలంలో అసైన్డ్ భూముల రక్షణకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రజా, దళిత, కార్మిక ఉద్యోగ సంఘాలను, మేధావులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడారు. అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న 9/77 చట్టాన్ని యథాప్రకారంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.రాజశేఖర్, ఎ.ప్రభాకర్, భూములు కోల్పోయిన పేదలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానంతో వైద్య రంగంలో ముందుకు

- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యరంగంలో నూతన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుని ముందుకు వెళ్లాల్సిన ఆవశ్యకత ఉందని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె మధుమూర్తి తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం 39వ వార్షికోత్సవ సభ విశ్వవిద్యా లయంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మధుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మొట్టమొదటిగా ఆరోగ్య విద్య కోసం ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారని, ఈ ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావుకు దక్కుతుందని అన్నారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానం వల్ల మారుమూల పల్లెలకూ వైద్యం అందుబాటులోకి రావడం మంచి పరిణామమని తెలిపారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలు రావడం వల్ల వైద్య సేవలు సామాన్యుడికి కూడా అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. రానున్న రోజుల్లో అభివృద్ధి చెందిన హెల్త్ కేర్ అందరికీ అందుబాటులోకి వస్తుందన్నారు. వైద్య విద్య డైరెక్టర్ జి రఘునందన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైద్య విద్యలో యుజి, పిజి సీట్లు పెరగడం సంతోష దాయకమని చెప్పారు. యూనివర్సిటీ ఉపాధ్యక్షులు పి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ పరిధిలో పరిశోధన కార్యక్రమాలకు బడ్జెట్ అందిస్తున్నామని తెలిపారు. సైకాలజీలో ఎంఫిల్ కోర్సును ప్రారంభిస్తున్నామని, అన్ని వైద్య కళాశాలల్లో అత్యవసర మందులను ఏర్పాటు చేస్తామన్నారు. యూనివర్సిటీకి అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం భూములను కేటాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి రాధికారెడ్డి, సైకియాట్రిస్ ఎండ్ల రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

- 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఆరుగొలను గ్రామంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని లాంఛనంగా ఈ నెల 3న ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. 2025-26 సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 3,013 రైతు సేవా కేంద్రాలు, 2,061 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు, ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు 10,700 మంది సిబ్బందిని సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన 24 నుంచి 48 గంటల్లో రైతుల ఖాతాల్లోకి నిధులు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తేమ శాతం నిర్ధారించే యంత్రాలు, రవాణా సదుపాయాల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా 7337359375 వాట్సాప్ నెంబరుకు హాయ్ అనే సందేశం పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధేది?

- వసతి గృహాల్లో సౌకర్యాలు అధ్వానం
- తాగునీటి సరఫరాలో లోపాలను పట్టించుకోని అధికారులు


వసతి గృహానికి వెళ్లే రోడ్డు దుస్థితి


కూలిన పిల్లుట్ల వసతి గృహం ప్రహరీ గోడ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల వద్ద పిల్లుట్ల రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బాలుర వసతి గృహం ఆధ్వాన పరిస్థితిలో ఉంది. ఈ వసతి గృహంలోకి వెళ్లేందుకు సరైన రహదారి లేదు. తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు తప్పుపట్టి పాచితో కన్పిస్తున్నాయి. కాంపౌండ్ వాల్ లేదు. వర్షాలకు హాస్టల్ పరిసరాల్లో మురుగు నీరు చేరి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజధాని ప్రాంతంలోని మంగళగిరి ఎస్‌సి బాలిక వసతి గృహంలోని 125 మంది బాలికలకు నాలుగు మరుగుదొడ్లు, నాలుగు బాత్ రూములు మాత్రమే ఉన్నాయి. దీంతో, బాలికలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలుర వసతి గృహంలో 24 మంది విద్యార్థులు ఉండగా, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక దుర్వాసన వెదజల్లుతోంది. బిసి బాలికల కళాశాల వసతి గృహంలో 58 మంది విద్యార్థులు ఉంటున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెదనందిపాడు మండలం అన్నపర్రు వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్‌లో గత నెల పదిన 55 విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహం విద్యార్థులను బయట జరిగే ఫంక్షన్లకు పంపిస్తున్నారని, బయట వండిన ఆహారాన్ని తీసుకువచ్చి విద్యార్థులకు అందిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై రాష్ట్ర న్యాయ శాఖ ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు వెళ్లి ఈ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అసౌకర్యాలపై న్యాయమూర్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉండే సంక్షేమ వసతి గృహాల్లో కనీస సౌకర్యాల కల్పనలో పాలకులు ఏ మాత్రమూ దృష్టి సారించడం లేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు వసతి గృహాల్లో తీవ్ర అసౌకర్యాల మధ్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఎక్కువ వసతి గృహాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. తీవ్ర తాగునీటి సమస్య వేధిస్తోంది. తాగునీరు సరఫరా చేసే ప్లాస్టిక్ టిన్నుల్లో ఈకోలస్ బ్యాక్టీరియా కూడా ఉన్నట్టు పలు వసతి గృహాల్లో జరిపిన పరీక్షల్లో వెల్లడైంది. మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిగా లేవు. వసతి గృహాల్లో దోమలు, క్రిమికీటకాల ధాటికి చర్మవ్యాధులు, జ్వరాల బారిన పడుతున్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే వారిని ఇళ్లకు పంపేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. వసతి గృహాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు వసతి గృహాలపై దృష్టి సారించడం లేదు. ఏదైనా సంఘటన జరిగితే తప్ప ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. వసతి గృహాల్లో గతంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు రాత్రి బస చేసి విద్యార్థులతో మమేకమై వారి సమస్యలు పరిష్కరించేందుకు గతంలో ప్రభుత్వాలు ప్రయత్నించాయి. గత కొనేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దాదాపు 30 వసతి గృహాల్లో తగిన సిబ్బంది లేరు. వసతి గృహాలకు సరఫరా చేసే తాగునీటికి అధికారులు పరీక్షలు చేయడం లేదు. దీనివల్ల తరచూ డయేరియా సమస్యలు వస్తున్నాయి.

సాంకేతికత వినియోగంలో సమతుల్యత అవసరం

- దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి
- విట్ స్నాతకోత్సవంలో మాజీ సిజెఐ ఎన్‌వి రమణ



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న ఎన్‌వి రమణ

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ ఆకాంక్షించారు. రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయం నిర్వహించిన ఐదవ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎన్‌వి రమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీ మాత్రమే జీవితం కాదని, దాని వినియోగంలో సమతుల్యత ఉండేలా చూసుకోవాలని చెప్పారు. సౌకర్యాలు లేనప్పటికీ రాజధానిలో యూనివర్సిటీ స్థాపించి వేలాది మందికి విద్యనందిస్తున్న ఛాన్సలర్ విశ్వనాథన్ అభినందనీయులన్నారు. విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న అనేక నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. శ్యాంసంగ్ ఎలక్ట్రానిక్స్-బెంగుళూరు సీనియర్ డైరెక్టర్ రాజీవ్ వర్మ మాట్లాడుతూ.. కష్టపడి, అంకితభావంతో పనిచేసే విద్యార్థులకు సవాళ్లు, సమస్యలు ఎదురైనా వాటి నుండి తమ విజయాలకు బాటలు వేసుకుంటారని, జీవితంలో అభివృద్ధి చెందుతారని అన్నారు. స్నాతకోత్సవం అనేది అంతం కాదని, నిరంతర అభ్యాసానికి నాంది అని చెప్పారు. విఐటి వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ..విఐటి విశ్వవిద్యాలయం అకాడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడం, భవిష్యత్ నాయకులను రూపొందించడంలో అంకితభావం కలిగి ఉందన్నారు. 2025 బ్యాచ్ విద్యార్థులు ప్రదర్శించిన కృషి, సంకల్పం, స్థితిస్థాపకతకు స్నాతకోత్సవం నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా 3,117 మంది డిగ్రీ పట్టాలను అందుకున్నారు. కార్యక్రమంలో విఐటి వైస్ ప్రెసిడెంట్‌లు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ జివి సెల్వం, విసి డాక్టర్ ఎస్‌వి కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, అకడమిక్స్ డీన్ డాక్టర్ ఎన్.మధుసూదనరావు, విద్యార్థి సంక్షేమ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదీర్ పాషా పాల్గొన్నారు.


హార్ట్ ఎయిర్ బెలూన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఏజెన్సీలో పర్యాటకాభివృద్ధికి కృషి

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తామని అందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి సంధ్యారాణి అన్నారు. శనివారం సీతంపేట మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద హార్ట్ హెయిర్ బెలూన్‌ను ఆమె ప్రారంభించారు. తొలుత మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి ఫొటోస్ సెషన్ ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి పార్క్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీతంపేట బస్టాండ్ నుంచి పార్కు వరకు జన జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. బిర్సాముండా 150 జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, జెసి యశ్వంత్ కుమార్ రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు

'కర్నూలు-విజయవాడ' ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ నడపాలి

- సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎ గఫూర్ డిమాండ్
- స్టేషన్ ఎదుట రెండ్రోజుల నిరసన దీక్ష ప్రారంభం


దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఎ గఫూర్ డిమాండ్ చేశారు. కర్నూలు నుండి విజయవాడకు రైళ్లను నడపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం కర్నూలు రైల్వే స్టేషన్ ఎదుట రెండ్రోజుల నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. నిరసన దీక్షలను గఫూర్ ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు కర్నూలు నుంచి హైదరాబాద్‌కు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ కోసం నాడు సిపిఎం చేసిన పోరాటం ఫలితంగానే ఇంటర్‌సిటీ రైలు వచ్చిందన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు లేకపోవడం అన్యాయమన్నారు. కర్నూలు నుంచి మచిలీపట్నం వరకు నడిచే రైలును రద్దు చేశారని, దీన్ని పునరుద్ధరించాలని కోరారు. పంచలింగాల రైల్వే వ్యాగన్ త్వరగా పూర్తి చేసి యువతకు ఉపాధి కల్పించాలని, కర్నూలు నుంచి ఓర్వకల్లు మీదుగా నంద్యాలకు రైలు మార్గం వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడారు. ఈ దీక్షలకు పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

బాలికపై అత్యాచార నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి- ఐ.పోలవరం

బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. అమలాపురం డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ వెల్లడించిన వివరాల మేరకు...అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక ఆరవ తరగతి చదువుతున్నారు. వరసకు చిన్నాన్న అయిన రాయపురెడ్డి సత్య వెంకటకృష్ణ బాలిక ఇంటికి వచ్చి చాక్లెట్ ఇవ్వడాన్ని చూసిన తల్లి బాలికను నిలదీసింది. ఎందుకు చాక్లెట్ ఇస్తున్నాడని ప్రశ్నించగా అసలు విషయం చెప్పింది. ప్రతి రోజూ చాక్లెట్ ఇచ్చి అత్యాచారం చేసేవాడని తెలిపింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు వెంకటకృష్ణను పోలీసులు అరెస్టు చేశారు.

సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతున్నాడని బాలుని హత్య

ప్రజాశక్తి - గండేపల్లి (కాకినాడ)


బాబ్జి (ఫైల్)

తన ఇంటి ముందు అర్ధరాత్రి సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతున్నాడనే కోపంతో బాలుడిని హత్య చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి కాకినాడ జిల్లా గండేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని యర్రంపాలెం గ్రామానికి చెందిన బుంగ బాబ్జి (17) తన స్నేహితునితో కలిసి శుక్రవారం అర్ధరాత్రి కాకర చిన్ని అనే వ్యక్తి నిర్మిస్తున్న ఇంటి వద్ద సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతున్నాడు. సెల్‌ఫోన్ నుంచి వస్తున్న శబ్ధం వల్ల తమకు ఇబ్బంది కలుగుతోందని, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బాలుడికి చిన్ని చెప్పాడు. అయినా ఆ బాలుడు గేమ్ ఆడుతుండటంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. చిన్ని చేతిలో ఉన్న కత్తితో ఆ బాలుడి మెడపై నరికేశాడు. దీంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రసంగిస్తున్న భారత మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

యువత దేశ సమైక్యతను కాపాడాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి- కడప అర్బన్ (వైఎస్ఆర్ జిల్లా)

దేశ సమైక్యతను, సంస్కృతిని, విలువలను యువత కాపాడాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లా యోగివేమన విశ్వవిద్యాలయంలోని నూతన పరిపాలనా భవనం అన్నమయ్య సెనేట్ హాలులో శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సభలో ప్రసంగించారు. సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని తెలిపారు. విద్యా వికాసంతో పాటు యోగా, క్రీడలు, కళలు, సాహిత్యం, మానసిక వికాసంపై దృష్టి సారించాలని చెప్పారు. సమాజంలో స్నేహ భావాన్ని పెంపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్, వైవియు విసి రాజశేఖర్, రిజిస్ట్రార్ పద్మ, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, యూనివర్సిటీ ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుపిఐ చెల్లింపుల్లో కొత్త రికార్డ్..

న్యూఢిల్లీ : భారతదేశ డిజిటల్ చెల్లింపులు నూతన రికార్డ్‌లను నమోదు చేస్తున్నాయి. అక్టోబర్‌లో యుపిఐ చెల్లింపులు సరికొత్త మైలురాయిని అధిగమించాయి. పండుగ సీజన్, వినియోగదారుల ఖర్చులు, వ్యాపార కార్యకలాపాలు పెరగడంతో లావాదేవీల సంఖ్య, విలువ రెండింటిలోనూ పెరుగుదల నమోదయ్యిందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) తెలిపింది. అక్టోబర్‌లో మొత్తం 2070 కోట్ల యుపిఐ లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ దాదాపు రూ.27.28 లక్షల కోట్లుగా ఉంది. సెప్టెంబర్ 2025తో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 3.6 శాతం, విలువలో 9.5 శాతం వృద్ధి చోటు చేసుకుందని ఎన్‌పిఐసి వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఇది మరింత పెరిగింది. అక్టోబర్ 18న అత్యధికంగా ఒకే రోజులో 75.43 కోట్ల లావాదేవీలు జరిగాయి.

సంపాదకీయం


ప్రగతి అంటే కేవలం భవనాలు, రహదారులే కాదు...ప్రతి పౌరుడూ గౌరవంగా బతగల హక్కు వున్న సమాజమే నిజమైన అభివృద్ధి. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడమే కాదు, పాలనలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం కూడా. ఈ సూత్రాన్ని ఆచరణాత్మకంగా మార్చే ప్రయత్నమే నవ కేరళ ప్రయాణం. ప్రభుత్వం చేపట్టిన 'నవ కేరళ సద్భావన యాత్ర'.. ఒక పరిపక్వ ప్రజాస్వామ్యానికి ప్రతీక. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు. ప్రజల కలల్ని, ఆశల్ని, సమస్యల్ని నేరుగా విని, వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించే ఒక సామూహిక యజ్ఞం. ఈ యాత్రలో ప్రజల నుంచి వచ్చిన సూచనల ఆధారంగానే 'నవ కేరళ సృష్టి పథకం' రూపొందింది. 'పాలన అనేది ప్రజల కోసం మాత్రమే కాదు, ప్రజలతో కలిసి సాగాల్సిన ప్రయాణం' అంటారు అంబేద్కర్. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, ఐటీ, పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాలు, ప్రజాసంక్షేమం, సామాజిక న్యాయం వంటి అనేక అంశాలకు కేరళ ఇచ్చిన ప్రాధాన్యత నవశకానికి, నవోదయానికి నాంది పలికింది. 'పేదరికం, ఆకలి నుంచి విముక్తి జరగాలన్న ఐరాస లక్ష్యాన్ని సాధించిన తొలి రాష్ట్రం కేరళ'. దేశంలోనే తొలి తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా ఖ్యాతి పొంది, చారిత్రాత్మక ప్రయాణంలో మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ ఘనత కేరళను ప్రపంచపటంలో ఒక మార్గదర్శిగా నిలబెట్టింది.

నవోదయం

కేరళ రాష్ట్రం ఏర్పడి 69 ఏళ్లు పూర్తయింది. విస్తీర్ణం పరంగా అతి చిన్న రాష్ట్రాలలో ఒకటి. అయినా ప్రపంచవ్యాప్తంగా గుర్తించే అనేక విజయాలను సాధించింది. తాజాగా కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన నవంబర్ 1న 'తీవ్ర పేదరికంలేని తొలి రాష్ట్రం'గా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ వెల్లడించారు. 'ఇది నవ కేరళ పుట్టుక' అని ఆయన అన్నారు. 2021లో ప్రమాణస్వీకారం తర్వాత మొదటి క్యాబినెట్‌లో 'తీవ్ర పేదరికాన్ని నిర్మూలించాలన్నది' ప్రధాన నిర్ణయం. అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా ఈ ఘనతను సాధించారు. వామపక్ష ప్రభుత్వ ప్రజా ప్రణాళికా విధానం ఇందుకు దిక్సూచి. ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వాన 1957లో ఏర్పడిన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం వేసిన పునాది మార్గదర్శకం. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అంటారు గురజాడ. కేరళ ప్రజల సంక్షేమాన్ని కేంద్రంగా పెట్టిన అభివృద్ధికి ఇదొక రూట్‌మ్యాప్. దేశంలో తొలి తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ అవతరించే ప్రక్రియపై 'ఇది కేవలం పరిపాలనా కార్యక్రమం మాత్రమే కాదు, వేలాదిమంది ప్రజల జీవితాలతో కూడిన ప్రయాణం' అంటారు స్థానిక స్వపరిపాలనా శాఖ ప్రత్యేక కార్యదర్శి టీవీ అనుపమ. ఏపీ విజన్ మాత్రం... కార్పొరేట్లతో చెట్టపట్టాలేసుకొని పయనిస్తోంది.


ఆర్థిక అసమానత-పెట్టుబడిదారీ విధానం యొక్క తోబుట్టువు. ఇది ధనవంతులను మరింత ధనవంతులుగా, పేదలను మరింత పేదలుగా మార్చే వ్యవస్థ. ఈ వ్యవస్థలోని భారతదేశంలో ఒక రాష్ట్రంలో అధికారంలో వున్న సిపిఎం నేతృత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం-తీవ్ర పేదరిక నిర్మూలనను సాధించింది. 'మనిషి అసలైన స్వేచ్ఛను పొందేది, అతడు సమాజంలో ఇతరులతో ఏకతను అనుభవించినప్పుడు మాత్రమే' అంటారు రవీంద్రనాథ్ టాగూర్. ఇది కేవలం నినాదం కాదు, మారిన మెరుగైన జీవన విధానం. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక ఆంక్షలు, అసమానమైన ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని, నిలదొక్కుకొని కొత్త శకంలోకి అడుగులు వేస్తోంది కేరళ. 'పేదరికాన్ని అంతం చేయడం కేవలం దాతృత్వం కాదు-అది న్యాయాన్ని సాధించడం' అంటారు నెల్సన్ మండేలా. అలాంటి కృషిలో భాగమే నవ కేరళ ఆవిష్కరణ. భారతదేశ వృద్ధి గాథకు మార్గదర్శిగా నిలిచింది కేరళ. 'ప్రజల శక్తి ముందు ఎలాంటి శక్తీ నిలవదు'-అన్న నమ్మకంతో ముందుకు సాగుతోంది. ఇదొక రాష్ట్ర ప్రయాణం కాదు, దేశం మొత్తం పాఠం నేర్చుకోవాల్సిన మార్గం. ఈ నవోదయం మన దేశానికి ఒక కొత్త ఉదయం. ప్రజల చేతుల్లోనే పాలన వున్న రోజున... ప్రజాస్వామ్యం నిజంగా వికసిస్తుంది. పరిమళిస్తుంది. పరిఢవిల్లుతుంది.


మహనీయుల మాట



మనకు ఒక ఆయుధాన్ని ఇచ్చినందుకు మనం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌కు రుణపడి వున్నాం. ఆ ఆయుధం మెషీన్ గన్ కాదు. అదే మార్క్సిజం-లెనినిజం.
- మావో

న్యాయవ్యవస్థకు తీవ్ర సవాళ్లు-సుప్రీం నూతన సారథి





తెలకపల్లి రవి

భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ఈ నెల 25న ప్రమాణ స్వీకారం చేస్తారని అధికారిక ప్రకటన వెలువడింది. 15 నెలల పాటు ఈ బాధ్యతలో వుండి ఆయన 2027 ఫిబ్రవరిలో పదవీ విరమణ చేస్తారు. హర్యానా నుంచి ఈ పదవిలోకి వస్తున్న తొలి వ్యక్తి ఆయన. 1985లో హిస్సార్‌లో న్యాయవాదిగా బయలుదేరిన జస్టిస్ సూర్యకాంత్ 2000 సంవత్సరంలో తన 38వ ఏట అతి చిన్న వయసులోనే అడ్వకేట్ జనరల్ కాగలిగారు. 2004లో పంజాబ్ హర్యానా హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. మోడీ ప్రభుత్వం ఏర్పడ్డాక 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఇటీవలి కాలంలో కాస్త చెప్పుకోదగినంత అంటే ఏడాదికి పైన సిజెఐ గా కొనసాగిన వారిలో జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తర్వాత అధిక పదవీకాలం జస్టిస్ సూర్యకాంత్‌దే. అయితే ఆయన బాధ్యతలు చేపట్టనున్న సమయం మాత్రం దేశానికీ, రాజ్యాంగానికీ, అంతకు మించి రాజ్యాంగ విలువలకూ పెద్ద సవాలు విసురుతున్న కాలం. ఎవరో ఎందుకు? ఇప్పుడు దిగిపోనున్న సిజెఐ బి.ఆర్.గవాయ్ పదవీ కాలంలో చేదు అనుభవాలే అందుకు సాక్ష్యం. జస్టిస్ బాలకృష్ణన్ దేశానికి రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తి. జస్టిస్ గవాయ్, ఆయన మీద నిండు న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాది చెప్పు విసిరితే ఎలాంటి చర్య కాదు కదా. చట్టపరమైన అభిశంసన, మందలింపు కూడా లేకుండా పోయింది. మామూలుగా ధర్మాసనంలో కూర్చున్న న్యాయమూర్తుల వ్యాఖ్యలకు రాజ్యాంగ రక్షణ వుంటుంది. కానీ ఇక్కడ సిజెఐ కే ఆ రక్షణ లేకుండా పోయింది.

చెప్పు విసిరినా సమర్థనా?

ఖజురహో ఆలయ సముదాయంలో ధ్వంసమైన విష్ణు విగ్రహాన్ని పునరుద్ధరించేందుకు ఉత్తర్వులు ఇచ్చే అధికారం తనకు లేదని జస్టిస్ గవాయ్ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంలో చెప్పారు. అందుకోసం ఆర్కియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థను ఆశ్రయించాలని సూచించారు. అయినా పిటిషనర్లు మొండిగా వాదిస్తుంటే 'ఆ విష్ణుమూర్తికే చెప్పుకోండి' అన్నారు. ఇందులో ఎవరినైనా అవమానించిందేముంది? అన్నిటికీ దేవుడే దిక్కు అన్నది అన్ని మతాల వారి నమ్మకమే కదా? కానీ ఇది హిందూ మతాన్ని అవమానించడమేనని దుమారం లేవదీశారు. తాను అన్ని మతాలనూ గౌరవిస్తాననీ ఎవరినీ కించపరిచే పని చేయడం జరగదని సిజెఐ స్పష్టంగా వివరణ ఇచ్చారు. అయినా సరే రాకేశ్ కుమార్ అనే మతతత్వ న్యాయవాదికి అదే ఘోర అపరాధంగా కనిపించింది. దానికి పాదరక్షతో శిక్ష విధించాలనుకున్నాడు. ఆఖరి నిముషంలో ఆయన దాడి విఫలమైనా గవాయ్ ఉపేక్షించి వదిలేశారు. ఇలాంటి వాటికి తాను ప్రభావితుణ్ని కాబోనన్నారు. ఈ విషయమై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌ను కూడా తేలిగ్గా వదిలేశారు. అయితే ఇప్పటికీ సిజెఐ వ్యాఖ్యలే తప్పయినట్టు, కేవలం ఉద్వేగం వల్లనే రాకేశ్ అలా ఆవేశపడినట్టు సమర్థనలు సాగుతూనే వున్నాయి. తాజాగా మోడియా ప్రముఖుడు ఆర్నబ్ గోస్వామి ఇంటర్వ్యూలో సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే కూడా మాటల్లో సంయమనం వుండాలని హితవచనాలు చెబుతున్నారు. ఈశ్వర్ అల్లా తేరేనాం అన్నందుకు గాంధీని చంపిన గాడ్సేను సమర్థించడం ఎలాంటిదో, చెప్పు విసిరిన రాకేశ్‌కు వంత పాడటం లేదా నామకార్థపు ఖండనలతో సరిపెట్టడం అలాంటివే. అయితే ఇది దేశంలో ప్రస్తుత పరిస్థితికి అద్దం పట్టే ఘటన. సిజెఐ కే రక్షణ లేని, గౌరవం లేని తరుణంలో ఆ వ్యవస్థ గౌరవాన్ని అంతకన్నా మించి బాధ్యతా నిర్వహణను హక్కులను కాపాడుకోవడం ఎలాగన్నది అసలైన సవాలు.

> **పశ్చిమ బెంగాల్‌లో సింగూరు భూమిని తిరిగి తమకు ఇచ్చేయాలని ఓ కంపెనీ వేసిన పిటిషన్‌ను తిరస్కరించిన కేసు, బిల్డర్లు-బ్యాంకు అధికారుల కుమ్మక్కుతో నిధుల గల్లంతుపై దర్యాప్తు, అసోంలో బూటకపు ఎన్‌కౌంటర్ల విచారణ, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణలో ప్రైవేటు కాంట్రాక్టర్లు లాభపడుతున్న తీరు వంటి అంశాలపై ఆయన కీలకమైన తీర్పులు ఇవ్వడం లేదా ఆ ధర్మాసనాలలో వుండటం సంభవించింది. అదే సమయంలో రణవీర్ అల్హాబాదియా తదితర స్టాండప్ కమెడియన్లకు సంబంధించిన పలు కేసుల్లో జస్టిస్ సూర్యకాంత్ కఠినతరమైన ఆదేశాలిచ్చారు. భావ ప్రకటనా స్వేచ్ఛ ఏదైనా మాట్లాడేందుకు లైసెన్సు కాదన్నారు. 'ఆపరేషన్ సిందూర్' సందర్భంలో సైన్యం తరపున మాట్లాడిన సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షా అనుచిత మత వ్యాఖ్యలు చేయడాన్ని కూడా జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా మందలించారు. జమ్ముకాశ్మీర్ 370 అధికరణం రద్దును సమర్థిస్తూ తీర్పునిచ్చిన ధర్మాసనంలోనూ ఆయన భాగస్వామిగా వున్నారు. తాజాగా బాబ్రీ మసీదుకు సంబంధించిన ఒక పోస్టుపై ఆయన ఆగ్రహం ప్రదర్శించడం అందరిలో ఆసక్తి కలిగించింది.**

ఇలాంటి తరుణంలో జస్టిస్ సూర్యకాంత్ 43వ సిజెఐ అవుతున్న తరుణంలో ఇది అందరికీ ఆలోచింపచేస్తున్న విషయం. ఎన్నికల సంఘం కుట్ర అంటున్న 'సర్' తుది తీర్పుతో సహా అనేక కీలక కేసులు కోర్టు ముందున్నాయి. ఇందులో 'సర్' కేసు విచారణలో ఆయన సభ్యులుగా వున్నారు కూడా. రాజద్రోహం సెక్షన్లకు కాలం చెల్లిందని తీర్పునిచ్చిన ధర్మాసనంలోనూ వున్నారు. పెగాసస్ నిఘా పరికరాలపై సమీక్ష, చార్‌ధామ్ క్షేత్రంలో నవీకరణ వల్ల పర్యావరణకు ముప్పు అన్న వాదన కొట్టివేత...ఇవన్నీ ఆయన విచారించిన వాటిలో కొన్ని.

మిశ్రమ సూచనలు

ఇంటిపని చేసేవారి హక్కుల కోసం ఏదైనా చట్టం చేయాలని ఒకసారి ఆదేశించారు. 2022లో పంజాబ్‌లో ప్రధాని మోడీ పర్యటన సందర్భంలో భద్రతా లోపాలు సంభవించాయనేదానిపైనా చర్యలకు ఆదేశించారు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మైనార్టీ ప్రతిపత్తి కేసు తీర్పులోనూ వున్నారు. పశ్చిమ బెంగాల్‌లో సింగూరు భూమిని తిరిగి తమకు ఇచ్చేయాలని ఓ కంపెనీ వేసిన పిటిషన్‌ను తిరస్కరించిన కేసు, బిల్డర్లు-బ్యాంకు అధికారుల కుమ్మక్కుతో నిధుల గల్లంతుపై దర్యాప్తు, అసోంలో బూటకపు ఎన్‌కౌంటర్ల విచారణ, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణలో ప్రైవేటు కాంట్రాక్టర్లు లాభపడుతున్న తీరు వంటి అంశాలపై ఆయన కీలకమైన తీర్పులు ఇవ్వడం లేదా ఆ ధర్మాసనాలలో వుండటం సంభవించింది. అదే సమయంలో రణవీర్ అల్హాబాదియా తదితర స్టాండప్ కమెడియన్లకు సంబంధించిన పలు కేసుల్లో జస్టిస్ సూర్యకాంత్ కఠినతరమైన ఆదేశాలిచ్చారు. భావ ప్రకటనా స్వేచ్ఛ ఏదైనా మాట్లాడేందుకు లైసెన్సు కాదన్నారు. 'ఆపరేషన్ సిందూర్' సందర్భంలో సైన్యం తరపున మాట్లాడిన సోఫియా ఖురేషిపై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్‌షా అనుచిత మత వ్యాఖ్యలు చేయడాన్ని కూడా జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా మందలించారు. జమ్ముకాశ్మీర్ 370 అధికరణం రద్దును సమర్థిస్తూ తీర్పునిచ్చిన ధర్మాసనంలోనూ ఆయన భాగస్వామిగా వున్నారు. తాజాగా బాబ్రీ మసీదుకు సంబంధించిన ఒక పోస్టుపై ఆయన ఆగ్రహం ప్రదర్శించడం అందరిలో ఆసక్తి కలిగించింది. టర్కీలో సోఫియా మసీదులా బాబ్రీ మసీదును ఎప్పటికైనా పునర్నిర్మాణం చేస్తామంటూ 2020లో పెట్టిన పోస్టు ఈ మధ్య సుప్రీంకోర్టుకు వచ్చింది. దానిపై కింద కోర్టు చర్యకు ఆదేశించగా పిటిషనర్ లక్నో హైకోర్టులో అప్పీలు చేసుకున్నారు. అక్కడ దాన్ని తోసిపుచ్చారు. దానిపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారించిన జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసింది. అయినా ఆ పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యర్థనలు, వాదనలు కొనసాగించడంతో జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. 'మీరు ఉపసంహరించుకునే అవకాశం మీకే ఇస్తున్నాను. లేదంటే భారీ ఖర్చులతో కొట్టివేయడమేగాక తీవ్ర వ్యాఖ్యలు చేసే అవకాశముంటుంది' అని హెచ్చరించారు. అత్యున్నత న్యాయస్థానమే ప్రతికూల వ్యాఖ్యలు చేస్తే కింద మరీ కష్టమనే భయంతో వారు దాన్ని ఉపసంహరించుకున్నారు.

అభ్యంతరాలు, అసలు సవాళ్లు

మొత్తం 300 బెంచీలలో పనిచేసిన జస్టిస్ సూర్యకాంత్ ఇచ్చిన తీర్పుల గురించి ఇలా చాలా ఉదాహరణలు చెప్పుకోవచ్చు. మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ రచనల ఆవిష్కరణ సందర్భంలో జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు కూడా న్యాయవర్గాలను ఆకర్షించాయి. న్యాయపరంగా నిష్పాక్షికత పాటించడం, నిర్మమకారంగా వ్యవహరించడం, అదే సమయంలో సమాజంతో సంబంధాలు పాటిస్తూ వారి మనోగతాలు తెలుసుకోవడం న్యాయమూర్తులు అనుసరించాల్సిన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్ ఇంజనీరింగ్, సమాజ స్థాయి పెంచడం జరగాలన్నారు. మొత్తంపైన రాజ్యాంగంపై, లౌకికతత్వంపై, మానవ హక్కులపై దాడిని ఆపాలనే రీతిలో ఆయన మాట్లాడింది తక్కువే. సాంకేతికాంశాలు, కేసుల పెండింగు తగ్గించడం, మౌలిక వసతులు పెంచడం వంటి వాటిపై ఎక్కువగా కేంద్రీకరిస్తారు. ఇక వివాదాస్పద విషయాలకు వస్తే 2018లో జస్టిస్ సూర్యకాంత్‌ను పంజాబ్ హైకోర్టు నుంచి హిమాచల్ ప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేసినప్పటి సమయంలోనూ, సుప్రీంకోర్టుకు ఆయన పేరు వచ్చిన తరుణంలోనూ బహిరంగంగానే అభ్యంతరాలు వచ్చాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.గోయల్ ఆయన పేరుపై వున్న అభ్యంతరాలు, ఆరోపణలతో లేఖ రాశారు. సీనియర్ న్యాయమూర్తులు అప్పటి సిజెఐ దీపక్ మిశ్రా తీరుపై విమర్శలతో మీడియా ముందు మాట్లాడిన సమయంలోనే ఇదీ జరిగింది. జస్టిస్ గోయల్ లేఖను తప్పు పడుతూ మరికొంతమంది లాయర్లు కూడా మీడియాలో వ్యాఖ్యలు చేశారు. ఒక దశలో కొలీజియం ముందుకు వచ్చిన పేర్లలో రెండింటిని ఆమోదించి జస్టిస్ సూర్యకాంత్‌తో సహా మరో పేరును పక్కనపెట్టారు. అయితే తర్వాత జస్టిస్ మదన్ బి.లోకూర్ పదవీ విరమణజరిగి కొలీజియం రూపు మారింది. ఆ స్థానంలో మోడీ పొగడ్తలలో శ్రుతిమించి విమర్శలు తెచ్చుకున్న జస్టిస్ అరుణ్ మిశ్రా కొలీజియంలోకి వచ్చాక జస్టిస్ సూర్యకాంత్ పేరును కూడా సుప్రీం కోర్టుకు సిఫార్సు చేయాలని కొలీజియం నిర్ణయించింది. ఆ విధంగా 2019లో బి.ఆర్.గవాయ్, సూర్యకాంత్‌లు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రతిపాదన వచ్చిన రోజునే వారు ప్రధాన న్యాయమూర్తులవుతారనేది అందరికీ తెలిసిన విషయం. ఎందుకంటే మన సుప్రీంకోర్టులో అత్యధిక సీనియర్లుగా వున్నవారినే ప్రధాన న్యాయమూర్తిగా చేస్తారు. అయితే హైకోర్టులకైనా సుప్రీం కోర్టుకైనా ఏ సిఫార్సును ఎప్పుడు ఆమోదిస్తారు? ఎంత కాలం ఆపేస్తారు? అన్నది ఈ నియామకంపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తుంది. నచ్చని వారిని కేంద్రం కావాలనే జాప్యం చేస్తుందని న్యాయవర్గాలు డజన్లకొద్దీ ఉదాహరణలతో చెబుతుంటాయి. ఈ కారణంగా సమర్థులు, అర్హులు అయిన అనేకమంది న్యాయమూర్తులు పైస్థాయికి చేరకుండానే పదవీ విరమణ చేయాల్సి వస్తుంటుంది. ఇక వారికి నియామక ఉత్తర్వు ఇచ్చిన తేదీ, సమయం, ప్రమాణ స్వీకారం చేసిన వరుస ఇవన్నీ సీనియారిటీకి కొలబద్దలవుతాయి. వ్యక్తిగత పూర్వరంగం ఒకటైతే న్యాయవ్యవస్థ ముందు ఇప్పుడున్న తీవ్ర సవాళ్ళు, ఒత్తిళ్లు, మితవాద మొగ్గు పెరుగుతుందన్న విమర్శలు, ఉదంతాల నేపథ్యంలో కొత్త సిజెఐ సూర్యకాంత్ తీరుతెన్నులు ఎలా వుంటాయో చూడాలి. ఆయన హయాంలో అనేక కీలక మార్పులను తీసుకురావాలని మోడీ సర్కారు పథకాలు రచిస్తున్నట్టు చెబుతున్నారు. దేశంలో లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, సమాఖ్యతత్వం, దేశ సార్వభౌమత్వం పరిరక్షణలో సుప్రీంకోర్టు కీలక పాత్ర వహించాలని ప్రజాస్వామ్య ప్రియులు కోరుకుంటారు. ★


> **వ్యక్తిగత పూర్వరంగం ఒకటైతే న్యాయవ్యవస్థ ముందు ఇప్పుడున్న తీవ్ర సవాళ్లు, ఒత్తిళ్లు, మితవాద మొగ్గు పెరుగుతుందన్న విమర్శలు, ఉదంతాల నేపథ్యంలో కొత్త సిజెఐ సూర్యకాంత్ తీరుతెన్నులు ఎలా వుంటాయో చూడాలి. ఆయన హయాంలో అనేక కీలక మార్పులను తీసుకురావాలని మోడీ సర్కారు పథకాలు రచిస్తున్నట్టు చెబుతున్నారు. దేశంలో లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కులు, సమాఖ్యతత్వం, దేశ సార్వభౌమత్వం పరిరక్షణలో సుప్రీంకోర్టు కీలక పాత్ర వహించాలని ప్రజాస్వామ్య ప్రియులు కోరుకుంటారు.**

ట్రంప్ బెదిరింపులతో రష్యా చమురు నిలిపివేత

వి. రాంభూపాల్

రష్యా ముడి చమురు దిగుమతుల్లో అమెరికా అధ్యక్షుడు గత కొంత కాలంగా చెబుతున్నదే మన దేశంలో నిజమవుతున్నది. రష్యా చమురు కొనుగోలు నిలిపివేస్తున్నట్లు ప్రధాని మోడీ తనకు హామీ ఇచ్చారని, త్వరలో అది అమలవుతుందని గత కొన్ని వారాలుగా ట్రంప్ పదేపదే ప్రకటించాడు. అవునని అంగీకరించక, కాదని తిరస్కరించక దేశ ప్రజలతో దోబూచులాడిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎట్టకేలకు ట్రంప్ ఒత్తిళ్ళకు తలొగ్గి రష్యా ముడి చమురు దిగుమతులను నిలిపివేసింది. ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు రష్యాతో చేసుకున్న పాత ఒప్పందాలను రద్దు చేసుకున్నాయి. మన దేశానికి ఆయిల్‌తో బయలుదేరిన పడవలను మన పాలకులు ట్రంప్ కరుణాకటాక్షాల కోసం సముద్ర మధ్య నుండే రష్యాకు వెనక్కి పంపించివేశారు. ఒకవైపు చైనాపై 10 శాతం సుంకాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్ మరోవైపు మన దేశ పాలకులపై ఇంతగా ఒత్తిడి తేవడానికి కారణం ఏమిటి? ప్రపంచంలో ఏ దేశాధినేత కంటే అధికంగా ట్రంప్‌ను కీర్తించింది మన ప్రధానే కదా! అయినా మన దేశం మీద ట్రంప్ బెదిరింపులు ఏమిటీ? అందుకు స్వప్రకటిత 'దేశభక్త' పాలకులు ఇంతగా ఎందుకు సాగిలపడుతున్నారు? అమెరికా ఒత్తిళ్ళకు లొంగిపోతే అది కేవలం రష్యా చమురుకే పరిమితం కాదు, మన దేశ వ్యవసాయ రంగంలోకి అమెరికా కంపెనీల ప్రవేశం వరకు కొనసాగే అవకాశం ఉంది. ఇది మన దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు మన సార్వభౌమత్వానికే అత్యంత ప్రమాదం. అమెరికా ఆర్థిక వ్యవస్థ గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. లాభాల వేటలో భాగంగా ఆ దేశ పెట్టుబడిదారులు ఉత్పాదక రంగం నుండి సేవా రంగానికి మళ్ళారు. వెనుకబడిన దేశాల కార్మికులతో చౌకగా పనిచేయించుకుని భారీగా లాభపడ్డారు. దీనివల్ల అమెరికాలో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగాయి. ఈ సమస్యలన్నింటికీ మూలం ఆ దేశం అనుసరించిన పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో వుంది. జబ్బు ఒకటైతే మందు మరొకటి అన్నట్లు ప్రపంచంపై తన ఆధిపత్యం కొనసాగించడం ద్వారా తన కష్టాలను ప్రపంచంపై రుద్దడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. అన్ని దేశాలు తాను చెప్పినట్లు, చెప్పిన సమయంలో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాలంటూ బెదిరించాడు. అందుకు సిద్ధపడని దేశాలపై టారిఫ్ టెర్రరిజాన్ని ప్రకటించాడు. ఈ దెబ్బతో అన్ని దేశాలు తమ ముందు మోకరిల్లుతాయని ట్రంప్ ఆశించాడు. కానీ చైనా, బ్రెజిల్, మెక్సికో లాంటి అనేక దేశాలు తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ అమెరికా ఒత్తిళ్ళను ప్రతిఘటించాయి. అమెరికా తమ సరుకులపై ఎంత పన్ను విధిస్తే, అంతే పన్ను మేము విధిస్తామని చైనా, బ్రెజిల్ లాంటి దేశాలు ప్రకటించాయి. చైనా మార్కెట్‌ను కాదని అమెరికా కంపెనీలు బతికే పరిస్థితి లేదు. అందుకే ట్రంప్‌పై ఒత్తిడి తెచ్చి చైనాతో ఒప్పందాలు చేయించుకున్నాయి. తాజాగా చైనాపై 10 శాతం సుంకాన్ని తగ్గిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించాల్సి వచ్చింది.

> **రష్యా చమురు నిలిపివేస్తే అమెరికా, సౌదీ అరేబియా, ఇరాక్‌ల నుండి అధిక ధరలకు కొనుగోలు చేయాలి. దీనివల్ల పెట్రోలియం ధరలు పెరిగి, ఆహార పదార్థాలు, వస్తువుల ధరలు భారీగా పెరుగుతాయి. ప్రజల కొనుగోలుశక్తి తగ్గి ఉత్పాదక రంగం మరింత బలహీన పడుతుంది. ఈ పరిణామాలన్నీ దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ముప్పుగా మారుతాయి. స్వయం అభివృద్ధి కోసం అనేక దేశాలు అమెరికా పెత్తనాన్ని ధిక్కరిస్తుంటే, చివరకు అమెరికాలోనే ప్రజలు ట్రంప్‌ను నిరసిస్తుంటే మన పాలకులు ఆయన ఒత్తిళ్ళకు లొంగిపోతున్నారు.**



> **ఇప్పటికే మన దేశ ఎగుమతులపై 50 శాతం సుంకాలను పెంచి చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ట్రంప్ దెబ్బతీశాడు. సినిమా, మందుల పరిశ్రమలపై వంద శాతం సుంకం వేశాడు. ఇంత ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపేందుకు సానుకూల పరిస్థితులను సృష్టించేందుకని...అమెరికా పత్తిపై 10 శాతం మాత్రమే సుంకాలు వేసేందుకు మోడీ ప్రభుత్వం అంగీకరించింది. ఇది ఇంతటితోనే ఆగదు. వ్యవసాయం, పాడి, పౌల్ట్రీ, మత్స్య రంగాల్లోకి అమెరికా కంపెనీలకు ద్వారాలు తెరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రష్యా ముడి చమురు చౌకగా కొని భారీగా లాభపడిన మన దేశ కార్పొరేట్ కంపెనీలు, తమ పెట్టుబడిని అమెరికా ఆశీస్సులతో విస్తరించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా రష్యా చమురు దిగుమతుల నిలిపివేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడింది.**

ఈ పరిస్థితుల్లో అత్యధిక జనాభా కలిగి, అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా వున్న మన దేశం మరింత దృఢంగా అమెరికా ఒత్తిళ్ళను ఎదిరించాలని దేశ ప్రజలు కోరుకుంటారు. అయితే మన పాలకుల తీరు అందుకు పూర్తి భిన్నంగా వుంది. ఇప్పటికే మన దేశ ఎగుమతులపై 50 శాతం సుంకాలను పెంచి చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ట్రంప్ దెబ్బతీశాడు. సినిమా, మందుల పరిశ్రమలపై వంద శాతం సుంకం వేశాడు. ఇంత ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అమెరికాతో వాణిజ్య చర్చలు జరిపేందుకు సానుకూల పరిస్థితులను సృష్టించేందుకని అమెరికా పత్తిపై 10 శాతం మాత్రమే సుంకాలు వేసేందుకు మోడీ ప్రభుత్వం అంగీకరించింది. ఇది ఇంతటితోనే ఆగదు. వ్యవసాయం, పాడి, పౌల్ట్రీ, మత్స్య రంగాల్లోకి అమెరికా కంపెనీలకు ద్వారాలు తెరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రష్యా ముడి చమురు చౌకగా కొని భారీగా లాభపడిన మన దేశ కార్పొరేట్ కంపెనీలు, తమ పెట్టుబడిని అమెరికా ఆశీస్సులతో విస్తరించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. అందులో భాగంగా రష్యా చమురు దిగుమతుల నిలిపివేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడింది.

రష్యా నుండి చమురు దిగుమతులు ఎందుకు పెరిగాయి?

2018-2022 మధ్య మన దేశ చమురు అవసరాల్లో 17 శాతం ఇరాన్, వెనిజులా నుండి దిగుమతి అయ్యేది. రష్యా, ఇరాక్, సౌదీ అరేబియా, యుఎఇ, బ్రెజిల్, అమెరికా, కువైట్, మెక్సికో, నైజీరియా దేశాల నుండి సుమారు 50 శాతం వచ్చేది. 2022 ఫిబ్రవరిలో రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ పరిస్థితి మారిపోయింది. ఈ యుద్ధాన్ని సాకుగా తీసుకుని రష్యా ఆర్థిక వ్యవస్థను కుంగదీసేందుకు అమెరికా, యూరోపియన్ యూనియన్, మరికొన్ని దేశాలు రష్యాపై ఆర్థిక ఆంక్షలు విధించాయి. రష్యా నుండి ముడి చమురు ఏ దేశం కొనరాదని ఆదేశించాయి. ఈ పరిస్థితి నుండి బయటపడేందుకు రష్యా చమురు ధరలను భారీగా తగ్గించుకోవడంతో పాటు, డాలర్‌లోనే చమురు కొనాలనే నిబంధనను సవరించుకుని ఆయా దేశాల కరెన్సీలతో అమ్మకాలు ప్రారంభించింది. ఈ పరిస్థితి మన దేశంలోని ఆయిల్ కంపెనీలకు పెద్ద వరంగా మారింది. గత మూడు సంవత్సరాల్లో బ్యారెల్‌కు 5 డాలర్ల నుండి 30 డాలర్ల వరకు తక్కువకు మన దేశ ఆయిల్ కంపెనీలు రష్యా నుండి పెద్ద ఎత్తున కొనుగోలు చేశాయి. 2021-22లో 4 మిలియన్ టన్నులుగా ఉన్న రష్యా చమురు దిగుమతి 2024-25 నాటికి 87 మిలియన్ టన్నులకు పెరిగింది. రాయిటర్స్ వార్తా సంస్థ నివేదిక ప్రకారం ఈ సంవత్సరం జనవరి- జులై మధ్య మన దేశం సగటున రోజుకు 17.3 లక్షల బ్యారెళ్ళ ముడి చమురును మన దేశం దిగుమతి చేసుకుంది.

లాభాలు కంపెనీలకు..భారాలు ప్రజలకు..

చౌకగా వచ్చిన ఈ చమురు వల్ల పెట్రోలు, డీజల్, గ్యాస్ ధరలు తగ్గించాల్సిన కేంద్రం అందుకు విరుద్ధంగా కార్పొరేట్ కంపెనీలకు దోచి పెట్టింది. ఈ మూడు సంవత్సరాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ లాంటి ఆయిల్ కంపెనీలు భారీగా లాభపడ్డాయి. రష్యా చమురు వల్ల ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు 35 శాతం లాభపడగా (ఇందులో అత్యధిక భాగం ప్రైవేట్ కంపెనీలకు పరోక్షంగా వెళ్ళాయి), మిగిలిన 65 శాతం లాభాలను రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ లాంటి ప్రైవేట్ కంపెనీలు కొల్లగొట్టినట్లు మనీలైఫ్ అనే సంస్థ తన నివేదికలో పేర్కొంది. ఆయిల్ కంపెనీలు 2023-24లో 2 లక్షల కోట్లు, 2024-25లో 2.46 లక్షల కోట్లు లాభపడ్డాయి. రష్యా ఆయిల్ కొన్నందుకు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల భారాన్ని దేశ ప్రజలు భరిస్తుంటే, ఈ ఆయిల్ దిగుమతుల వల్ల వచ్చిన లాభాలను అంబానీ, అదానీల ఖజానాలను నింపాయి. 2014లో 1.5 లక్షల కోట్లు వున్న ముఖేష్ అంబానీ సంపద 2025 అక్టోబరు నాటికి 9.55 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో గౌతమ్ అదానీ సంపద 57 వేల కోట్ల నుండి 8.15 లక్షల కోట్లకు పెరిగింది. దేశ పాలకులకు కార్పొరేట్ కంపెనీలకు వున్న బలమైన ఆర్థిక బంధానికి ఇంతకంటే నిదర్శనం కావాలా?

చమురు ధరలు మరింత పెరుగుతాయి

కూనరిల్లుతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి, ముడి చమురుపై తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి మనలాంటి దేశాలపై అమెరికా బెదిరింపులకు దిగుతుంది. దీనికి కేంద్ర బిజెపి ప్రభుత్వం లొంగిపోవడం చాలా దారుణం. గతంలో నిత్యం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఈ కాలంలో పెరగకపోవడానికి ప్రధాన కారణం రష్యా ముడి చమురు చౌకగా అందుబాటులోకి రావడం. రష్యా చమురు నిలిపివేస్తే అమెరికా, సౌదీ అరేబియా, ఇరాక్‌ల నుండి అధిక ధరలకు కొనుగోలు చేయాలి. దీనివల్ల పెట్రోలియం ధరలు పెరిగి, ఆహార పదార్థాలు, వస్తువుల ధరలు భారీగా పెరుగుతాయి. ప్రజల కొనుగోలుశక్తి తగ్గి ఉత్పాదక రంగం మరింత బలహీన పడుతుంది. ఈ పరిణామాలన్నీ దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ముప్పుగా మారుతాయి. స్వయం అభివృద్ధి కోసం అనేక దేశాలు అమెరికా పెత్తనాన్ని ధిక్కరిస్తుంటే, చివరకు అమెరికాలోనే ప్రజలు ట్రంప్‌ను నిరసిస్తుంటే మన పాలకులు ఆయన ఒత్తిళ్ళకు లొంగిపోతున్నారు. ప్రజల మధ్య చీలికలు సృష్టించే మతతత్వాన్ని, కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే ఆర్థిక విధానాలను ప్రజా ఉద్యమాల ద్వారా ఎదుర్కోవాలి. ★

కేరళ ప్రగతికి మద్దతు...



తీవ్ర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళను ముఖ్యమంత్రి పినరయి విజయన్ శనివారం ప్రకటించారు. అనంతరం జరిగిన బహిరంగ సభ వేదిక వద్ద కేరళ సిఎంతో ప్రముఖ సినీనటులు కమల్‌హాసన్, మమ్ముట్టి, మోహన్‌లాల్.

జిఎస్‌టి శ్లాబులు తగ్గినా వసూళ్లు ఫుల్

- అక్టోబర్‌లో రూ.1.96 లక్షల కోట్ల రాబడి
- ఎపిలో 9 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబులను కుదించినప్పటికీ పన్ను వసూళ్లు రికార్డ్ స్థాయిలోనే నమోదయ్యాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో 4.6 శాతం వృద్ధితో రూ.1.96 లక్షల కోట్ల పన్ను వసూళ్లు జరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. 2024 ఇదే నెలలో రూ.1.87 లక్షల కోట్లు వసూళ్లయ్యాయి. ఈ ఏడాది ఆగస్టులో రూ.1.86 లక్షల కోట్లు, సెప్టెంబర్‌లో 1.89 లక్షల కోట్ల చొప్పున రాబడి నమోదయ్యింది. గడిచిన నెలలతో పోల్చి చూసినప్పుడు సగటున 9 శాతం పెరుగుదల చోటు చేసుకోవడం విశేషం.

దేశ వ్యాప్తంగా జిఎస్‌టి పన్ను వసూళ్లు పెరగ్గా.. ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన గణంకాలు నెలకొనడం గమనార్హం. ఈ ఏడాది అక్టోబర్‌లో ఎపిలో జిఎస్‌టి వసూళ్లు 9 శాతం తగ్గి రూ.3,490 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నెలలో రాష్ట్రంలో రూ.3,815 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. పొరుగు రాష్ట్రం తెలంగాణలో గడిచిన నెలలో జిఎస్‌టి వసూళ్లు 10 శాతం పెరిగి రూ.5,726 కోట్లకు చేరాయి. అక్కడ 2024 ఇదే నెలలో రూ.5,211 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి.

కిచెన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సహా మొత్తం 375 రకాల ఉత్పత్తులను జిఎస్‌టి తక్కువ రేటు శ్లాబులోకి మార్చిన విషయం తెలిసిందే. ఇంతక్రితం 5, 12, 18, 28 శ్లాబులుగా ఉన్న జిఎస్‌టి రేట్లను సెప్టెంబర్ 22 నుంచి 5 శాతం, 12 శాతాలకు పరిమితం చేశారు. దసరా నవరాత్రుల ప్రారంభం నుంచి ఈ కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. జిఎస్‌టి రేట్లను తగ్గిస్తామని ఆగస్టు 15న పిఎం మోడీ ప్రకటించగా.. అనేక మంది వినియోగదారులు కొనుగోళ్లను వాయిదా వేసుకోవడంతో అక్టోబర్‌లో భారీగా విక్రయాలు జరిగాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అక్టోబర్ మొత్తం వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగం నుంచి రాగా.. దిగుమతులపై సుంకాల ద్వారా రూ.50,884 కోట్లు సమకూరాయి. జిఎస్‌టి రిఫండ్స్ రూ.26,934 కోట్లు మినహాయిస్తే నికర జిఎస్‌టి వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. సెంట్రల్, స్టేట్, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి అన్నీ అక్టోబర్ నెలలో వృద్ధిని నమోదు చేశాయి. సెస్ వసూళ్లు మాత్రం తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో జిఎస్‌టి వసూళ్లు 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2017లో జిఎస్‌టిని అమలు చేసినప్పటి నుంచి ఇదే అత్యధికం కావడం విశేషం.

ఎల్‌ఐసిలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు

హైదరాబాద్ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి) శనివారం విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలను నిర్వహించింది. హైదరాబాద్ జోనల్ ఆఫీస్ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజనల్ ఆఫీస్‌లోని అన్ని కార్యాలయాల ఉద్యోగులు, ఏజెంట్లు భాగస్వామ్యమయ్యారు. ఈ వాకథాన్‌ను జోనల్ ఆఫీసు వద్ద ఎపి, టిజి రీజినల్ మేనేజర్ (మార్కెటింగ్) ఎం రవి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ తల్లి ఫ్లైఓవర్, మింట్ కాంపౌండ్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్, ప్రసాద్స్ ఐమాక్స్, లుంబినీ పార్క్ మీదుగా నడిచి ఎల్‌ఐసి జోనల్ ఆఫీస్ వద్ద ముగించారు. ఈ మార్గం అంతా విజిలెన్స్ అవగాహనపై సందేశాలను ప్లకార్డులు ద్వారా ప్రదర్శించారు. "ఎల్‌ఐసి రోజువారీ కార్యకలాపాలలో విజిలెన్స్ కోణంపై లోతైన అవగాహన కలిగి ఉండాలి. అవినీతిని అరికట్టడంలో ముఖ్యమైన పాత్రను పోషించాలి." అని జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ తమ సిబ్బందికి సూచించారు. చెడు ప్రభావాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడమే దీని లక్ష్యమని జోనల్ విజిలెన్స్ అధికారి ఇ విద్యాధర్ పేర్కొన్నారు. ఈ వాకథాన్‌లో ఎల్‌ఐసి సీనియర్ అధికారులు పిజి కుమార వైద్యలింగం, శరవణ రమేష్, ఎఎం హిలాలి, జి మధుసూధన్, కె సంధ్యారాణి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమాయకుల బలికి కారకులెవరు..?



ప్రజాశక్తి-అమరావతి

తిరునాళ్లు, జాతరలు తెలుగు ప్రజలకి కొత్తకాదు. ఎంతో సంబరంగా, ఉత్సాహంగా వాటిని నిర్వహించుకోవడం ఇక్కడ ఆనవాయితీ. లక్షల్లో జనం గుమిగూడినా, రేయింబవళ్లు వేచి చూసినా ఆ కార్యక్రమాలు ఎంతో సజావుగా గడిచిపోయేవి. అయితే ఇదంతా ఒకప్పుడు.. ఇప్పుడు అలా లేదు. జనసందోహాలతో, పోటెత్తిన సమూహాలతో ఉత్తరాదిలో తరచూ జరిగే ఉపద్రవాలు ఇక్కడ కూడా జరగడం ఆందోళన కలిగించే విషయం. తిరుపతి ఘటన మరువక ముందే తాజాగా శ్రీకాకుళంలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో దారుణం జరిగింది. మృతులంతా మహిళలు, పిల్లలు, వృద్ధులు. నిర్వాహకుల అలసత్వం, ప్రభుత్వ వైఫల్యం ఈ ఘటనలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

12 ఎకరాల సొంత భూమిలో హరిముకుంద్ పండా ఈ ఆలయాన్ని ప్రారంభించారు. 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.20 కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. ఈ ఏడాది మే నుండే ఇక్కడ దర్శనాలు మొదలయ్యాయి. ఇంత తక్కువ సమయంలోనే ఆలయానికి ఇంత జనం పోటెత్తడానికి కారణమేంటి? 2 నుండి 3 వేల లోపు భక్తులకి మాత్రమే అవకాశమున్న ఆలయానికి 15 వేలకి మించి జనాలు వచ్చారు.

మితిమీరిన ప్రచారం.. కొరవడిన భద్రత

'నవంబరు 1న, శనివారం కార్తీక ఏకదాశి పర్వదినాన వేంకటేశ్వరున్ని దర్శించుకుంటే మీకు...' అంటూ సోషల్‌మీడియాలో విపరీత ప్రచారం చేశారు. ఆలయ నిర్మాణం గురించి గతంలో అనేకసార్లు విశేషంగా ప్రస్తావించారు. దీంతో స్వల్ప కాలంలోనే ఈ ఆలయం చిన్న తిరుపతిగా ప్రసిద్ధిలోకి వచ్చింది. ఇప్పుడు 'పవిత్ర దినం' అన్న ముద్ర అదనంగా తోడైంది. ఫలితంగా చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు, పిల్లలు, వృద్ధులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఇంత విస్తృతంగా ప్రచారం చేసిన ఆలయ నిర్వాహకులు అందుకు తగిన స్థాయిలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయలేదు. కనీసం ప్రైవేటు వాలంటీర్లతో రక్షణ చర్యలు కూడా చేపట్టలేదు.

నేరం నిర్వాహకులపై తోసేసి చేతులు దులుపుకున్న యంత్రాంగం

సాధారణంగా జన సమూహాలు పోగయ్యేచోట ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుంది. 'చట్టప్రకారం ఇంతమంది పోగవ్వకూడదు' అన్న రూల్స్‌ని కూడా ఖరాఖండిగా పాటిస్తుంది. ప్రభుత్వ చర్యలకి ఎన్నోసార్లు ఎంతోమంది ఇబ్బందులు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇక ఆలయాల్లో జరిగే విశేష క్రతువులప్పుడు పాలకుల ఆదేశాలతో అధికారులు తమ సిబ్బందిని సమాయత్తం చేయడం కనిపిస్తుంది.

కానీ ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు. 'అది ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే ఆలయం. కార్యక్రమం గురించి మాకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. కాబట్టే ఈ ప్రమాదం జరిగింద'ని చేతులు దులుపుకోవడం ప్రజా సంరక్షణ పట్ల పాలకుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

ప్రచార వేదికలకూ భాగం..

భీతావహంగా ఉన్న ఈ దృశ్యాలని చూసిన వారంతా అయ్యో అని కన్నీరుపెట్టారు. అయితే.. ఈ ప్రమాదం దానంతట అదే వచ్చిపడింది కాదు. నిర్వాహకులు, యంత్రాంగ లోపం ప్రధానంగా కనిపిస్తున్నా, మరో కోణం కూడా ఎవరికి వారే పరిశీలించుకోవాలి. ఈ మధ్యకాలంలో ప్రధాన స్రవంతి టివి కార్యక్రమాల్లో సోషల్‌మీడియాలో ఇలాంటి పూజా క్రతువుల గురించి విశేషప్రచారం చేస్తున్నారు.

ఆతృత.. ఆందోళన..

పూలు, పళ్లు, అగరుబత్తీ, కర్పూరాలు, ఆకు, వక్క వంటి పూజాద్రవ్యాలని ఎంతో శ్రద్ధగా పట్టుకువచ్చిన వారంతా ఈ 'పవిత్ర దినం'న ఎలాగైనా 'స్వామివారి దర్శనం చేసుకోవాల్సిందే' అన్న దృఢసంకల్పంతో అక్కడ వేచి ఉన్నారు. తెల్లవారే ఇంట్లో పిల్లలకి, భర్తకి కావాల్సినవన్నీ సర్దిపెట్టి బయల్దేరారు కొందరు. ఇంట్లో ఉన్న మామ్మలు ఎప్పటినుండో గుడికి తీసుకెళ్లమంటున్నారని వాళ్లని వెంటపెట్టుకొచ్చారు ఇంకొందరు. ఈ 'పవిత్ర దినం'న దర్శించుకుంటే మంచిదని ప్రచారం చూసినప్పటి నుండి పిల్లలతో గుడికి వెళ్లాల్సిందేనని మొండిపట్టు పట్టి భర్తలతో కదిలివచ్చారు మరికొందరు. వేకువజాము నుండే భక్తుల తాకిడి ఎక్కువైంది.

అప్పటివరకు సందడిసందడిగా ఉన్న ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా సంభవించిన అనుకోని ప్రమాదంతో భీకర ఆర్తనాదాలు చుట్టుముట్టాయి. ఏడుపులు, పెడబొబ్బలతో జనాలు పరుగులు పెట్టారు. అయినవారి ఆచూకి కానరాక, ఊపిరాడని ఆ గుంపులోనే తమవాళ్లని వెతుక్కున్నారు చాలామంది. ఏం జరిగిందో అర్థంకాని అయోమయంలో అరుస్తూ, ఏడుస్తూ బయటికి పరుగెత్తారు అనేకమంది. పూలసజ్జలు, ఆరతిపళ్లేలు, పూజాద్రవ్యాలు ఎక్కడపడితే అక్కడ చిందరవందరంగా పడిఉన్నాయి. రెప్పపాటు కాలంలో అంతా అయిపోయింది. అభంశుభం తెలియని అమాయకులు, పిల్లల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

శ్రీకర్ భరత్ సెంచరీ మిస్

- ఒడిషాతో రంజీట్రోఫీ మ్యాచ్



కటక్: ఒడిషాతో జరుగుతున్న రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ తృటిలో సెంచరీని మిస్ చేసుకున్నాడు. ఓపెనర్లు అభిషేక్ రెడ్డి, శ్రీకర్ భరత్ తొలి వికెట్‌కు 161 పరుగుల భారీ భాగస్వామ్యాని నెలకొల్పారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 3వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రకు అదిరే ఆరంభం లభించింది. అభిషేక్ రెడ్డి(76), శ్రీకర్ భరత్(93) తొలి వికెట్‌కు గట్టి పునాది వేశారు. శ్రీకర్ భరత్ వ్యక్తిగత స్కోర్ 93పరుగుల వద్ద బిస్వాల్ బౌల్డ్ చేయడంతో పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత కెప్టెన్ రికీ బుయ్(0) డకౌటయ్యాడు. క్రీజలో రషీద్(25), కరణ్ షిండే(16) ఉన్నారు. ఒడిషా బౌలర్లు బారల్‌కు రెండు, బిస్వాల్‌కు ఒక వికెట్ దక్కాయి.

రాణించిన హైదరాబాద్ బౌలర్లు..

ఎలైట్ గ్రూప్-డిలో హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లు రాణించారు. రోహిత్ రాయుడు(3/51), త్యాగరాజన్(2/77)కి తోడు మిలింద్, నిషాంత్ ఒక్కో వికెట్‌తో మెరిసారు. దీంతో తొలిరోజు ఆటముగిసే సమయానికి హిమాచల్ ప్రదేశ్ జట్టు 7వికెట్ల నష్టానికి 293పరుగులు చేసింది. హిమాచల్ బ్యాటర్లు వశిష్ట్(114) సెంచరీకి తోడు ఓపెనర్ పురోహిత్(37) బ్యాటింగ్‌లో రాణించారు.

మహిళ దారుణ హత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా నవీపేటలో గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. శరీరం నుంచి తల వేరు చేసి చేతివేళ్లు సగం వరకు తెగి ఉండడంతో స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శనివారం ఉదయం నవీపేట బాసర రహదారి సమీపంలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి తల లేదు, చేతుల వేళ్లు సగం వరకు తెగి ఉన్నాయి. మహిళ వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహం వివస్త్రగా ఉండడంతో అత్యాచారం చేసి హత్య చేసుంటారని, వేరే ప్రాంతంలో చంపి ఇక్కడ పడేశారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు సామ్‌సంగ్ సాంకేతిక నైపుణ్యాలు

గుర్‌గావ్ : సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ద్వారా తాము యువతకు సాంకేతిక నైపుణ్యాలలో విద్యను అందించడమే కాకుండా, అర్థవంతమైన కెరీర్‌లను నిర్మించడానికి మద్దతును అందిస్తుందని సామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్, సిఇఒ జెబి పార్క్ పేర్కొన్నారు. గోరఖ్‌పూర్‌లో 1600 మంది సాంకేతిక నైపుణ్యాలను అందించగా.. వారికి సర్టిఫికెట్లు అందించామని తెలిపారు. దేశంలో డిజిటల్ మార్పును తీసుకురావడానికి సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందిస్తున్నామన్నారు ఎఐ, ఐఒటి, బిగ్‌డేటా, కోడింగ్, ప్రోగ్రామింగ్ వృద్ధికి మద్దతును అందిస్తున్నామన్నారు.

'ఇండోసోల్' కోసం గిరిజనులను బలి పెడతారా?

- ప్రజలకు వాస్తవాలు చెప్పాలి
- సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ, నెల్లూరు ప్రతినిధి

ఇండోసోల్ కోసం గిరిజనులను బలి పెడతారా? అని సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ థర్మల్ ప్లాంట్‌పై జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు వాస్తవాలు చెప్పాలని జిల్లా డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం విలేకర్లతో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండోసోల్ కోసం సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో జెన్‌కో పేరుతో భూసేకరణ ప్రయత్నించడం సరికాదన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే చిన్న వెన్నెలవలస మినీ రిజర్వాయర్ నుంచి ఆరు టిఎంసి నీటిని ఇవ్వడం వల్ల రైతులు ఉపాధి కోల్పోయి వలసబాట పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. థర్మల్ పవర్ ప్లాంట్ వల్ల బూడిదొస్తుందప్ప, ఉపాధి రాదన్నారు.

ఇండోసోల్ కంపెనీకి వ్యతిరేకంగా కరేడులో ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తున్నారని, కోర్టు కూడా ప్రజలకు, భూములకు నీరు ఇవ్వాలని చెప్పిందని గుర్తు చేశారు. ఇండోసోల్ కంపెనీ గతంలో స్మార్ట్ మీటరు కోసం ఒప్పందం చేసుకొని నేడు రాష్ట్రాన్ని దోసుకుంటోందని, అలాంటి కంపెనీకి శ్రీకాకుళం జిల్లాను ధారాదత్తం చేయాలని చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇండోసోల్ థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కరేడులో ప్రతిఘటిస్తే సరుబుజ్జిలిలో ఇస్తారా?




ఇండోసోల్ కంపెనీ ఎన్ని ప్రలోభాలు పెట్టినా కరేడు రైతులు భూములు ఇవ్వలేదు. రెండు పంటలు పండే భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తోంది. నెల నుంచి దశల వారీ పోరాటం సాగుతోంది. రైతులతో చర్చించకుండా భూములు ఎలా తీసుకుంటారని ఏకంగా హైకోర్టు అధికారులకు చివాట్లు పెట్టింది. ప్రజాభిప్రాయ సేకరణ సభ తీర్మానం అమలు చేయకుండా ఇలా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నించింది. ఇక్కడ ఇంతలా ఉద్యమం జరగడమేగాక న్యాయస్థానం కూడా వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలో అదే ఇండోసోల్ కంపెనీకి ప్రభుత్వ భూములెలా కట్టబెడుతుంది? దారుణమైన ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలి.

- జివిబి కుమార్, కరేడు ఉద్యమ నేత

బ్యాటర్లు రాణిస్తేనే..

నేడు ఆస్ట్రేలియాతో మూడో టి20
మధ్యాహ్నం 1.45ని.లకు



హోబర్ట్(ఓవల్): రెండో టి20లో చిత్తుగా ఓడిన టీమిండియా ఇక మూడో టి20పై దృష్టి సారించింది. మెల్‌బోర్న్‌లో పరాజయానికి కారణాలు ఏంటో లోతుగా అన్వేషించాల్సిన పనిలేదు. బ్యాటర్ల వైఫల్యం కారణంగా ఓడిన సంగతి తెలిసిందే. దీంతో బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉండేందుకు తుది జట్టులో ఏవైనా మార్పులు చోటు చేసుకుంటాయా? అని సగటు అభిమాని ఆశించక తప్పదు. ఈ ఫార్మాట్‌లో హిట్టైన ఆటగాళ్లను వదిలేసి.. ప్రయోగాలకు తెరతీసిన కోచ్ గౌతం గంభీర్ కూడా ఓ రకంగా బాధ్యుడేనని మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. టి20ల్లో అభిషేక్ శర్మకు జోడీగా శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్‌గా కొనసాగించడంపై మాజీలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. దాంతో.. ఫామ్‌లో లేని గిల్‌ను తప్పించాలనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ఇక లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను తుది జట్టులోకి తీసుకోకపోవడం పెద్ద పొరపాటని నిరూపితమైంది. టి20ల్లో అత్యధిక వికెట్లు (101) తీసిన భారత బౌలర్ అయిన అర్ష్‌దీప్‌ను పక్కన పెట్టేయడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. శివం దూబేని కాదని హర్షిత్ రాణాను ముందు పంపడం.. [illegible] ఇచ్చినా దూబే మాత్రం నిరాశపరిచాడు. సిరీస్ సమం చేయాలంటే మూడో వన్డేలో సూర్యకుమార్ సేన కచ్చితంగా గెలవాలి. పేస్, బౌన్సీ పిచ్‌ల మీద చెలరేగిపోయే అర్ష్‌దీప్‌ను తుది జట్టులోకి తీసుకోవడంతో పాటు యశస్వికి ఓపెనింగ్ ఛాన్స్ ఇవ్వాలని విశ్లేషకులు భావిస్తున్నారు.

జట్లు(అంచనా)...

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్/జైస్వాల్, సంజు(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, దూబే/అర్ష్‌దీప్, అక్షర్, హర్షిత్ రాణా, కుల్దీప్, వరణ్ చక్రవర్తి, బుమ్రా.

ఆస్ట్రేలియా: మాఛెల్ మార్ష్(కెప్టెన్), ఇంగ్లిస్(వికెట్ కీపర్), హెడ్, టిమ్ డేవిడ్, ఓవెన్, స్టొయినీస్, బార్ట్‌లెట్, ఎల్లిస్, కుహ్నేమన్, షార్ట్, హేజిల్‌వుడ్.

తగ్గిన జిఎస్‌టి

- రాష్ట్ర ఆదాయంపై ప్రభావం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

జిఎస్‌టి-2 అమలు రాష్ట్రంపై ప్రభావం చూపింది. అక్టోబర్‌లో వసూళ్లు తగ్గుముఖం పట్టడం విశేషం. అలాగే గత నెల కన్నా కూడా వసూళ్లలో లోటు కనిపించింది. తాజాగా వాణిజ్య పన్నుల శాఖ విడుదల చేసిన గణాంకాల మేరకు అక్టోబర్‌లో 3,490 కోట్లు జిఎస్‌టిగా వసూలయ్యాయి. అదే గత ఏడాది 3,815కోట్లు వసూలు కావడం విశేషం. అంటే 325 కోట్లు తగ్గుముఖం పట్టినట్లు తేలింది. గత ఏడాది సెప్టెంబర్‌లో 3,653 కోట్లు వసూలుకాగా, అది ఈ నెల వసూళ్ల కన్నా కూడా 163 కోట్లు అధికంగా ఉండడం విశేషం. గత నెల్లో 20 రోజుల వరకు పాత జిఎస్‌టి, మిగిలిన రోజులకు కొత్త జిఎస్‌టి అమలులో ఉండడం గమనార్హం. అందుకే ఈ రెండు నెలల మధ్య లోటు మరింత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అలాగే గత కొన్ని నెలలుగా ప్రతి నెలా వృద్ధి పెరుగుతూ రికార్డులు సృష్టిస్తుండగా, ఈ నెల మాత్రం తగ్గింది.

సమ్మె కాలాన్ని పని దినాలుగా గుర్తించాలి

- మంత్రి సత్యకుమార్‌కు పిహెచ్‌సి వైద్యుల సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ డిమాండ్ల సాధన కోసం 23 రోజులపాటు చేసిన సమ్మె కాలాన్ని పని దినాలుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను అసోసియేషన్ నేతలు శనివారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. పొరుగు రాష్ట్రాలు, దేశాల్లో వైద్య విద్యను పూర్తిచేసిన రాష్ట్రానికి చెందిన వారిని స్థానికులుగా గుర్తించి పిజి వైద్య విద్యలో అవకాశాలు కల్పించాలని కోరారు. ఆరేళ్ల బదులు నాలుగేళ్ల పాటు పట్టణాల్లో పనిచేసిన వైద్యుల సర్వీసులను గుర్తించి పిజి ఇన్ సర్వీస్ కోటా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. గతేడాది మాదిరి నీట్ పిజిలో జాతీయ వైద్య కమిషన్ తగ్గించే కటాఫ్‌కు అనుగుణంగా ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టైమ్ బౌండ్ ఉద్యోగోన్నతులు, ట్రైబల్ అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇతర ఉద్యోగ సర్వీస్ అంశాలు పరిష్కారం కోసం ఉత్తర్వులివ్వాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి రవీంద్ర నాయక్, కెఎంఆర్ కిషోర్, కోశాధికారి వినోద్‌కుమార్ ఉన్నారు.

జగన్ నోరు విప్పితే అబద్ధాలే

- వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ సిఎం వైఎస్ జగన్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనలో రైతులు అప్పులు, పంట నష్టాలు అనుభవించారని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వరదలు, తుపానులు వచ్చినప్పుడు ఈ ప్రాంత ప్రజలకు కనీసం ముఖం చూపించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం తుపాను ముందే చర్యలు తీసుకొని ప్రాణనష్టం తగ్గించిందని తెలిపారు. రైతులకు రూ.6 వేలకోట్లు ఇన్సూరెన్స్ ఇచ్చానని జగన్ చెప్పడం పెద్ద అబద్ధమని పేర్కొన్నారు.

టిడిపి కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

టిడిపి కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఆ పార్టీ సీనియర్ నాయకులు, శ్రీశైలం ఆలయ బోర్డు సభ్యులు ఎవి రమణ, పార్టీ ఎన్‌ఆర్‌ఐ వింగ్ రాజశేఖర్, నేతలు పర్చూరి కృష్ణ, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు మాట్లాడే ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని నేతలు ఈ సందర్భంగా అన్నారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

- జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జెఎసి కోరింది. ఈ మేరకు జెఎసి ఛైర్మన్ కె సురేష్, కో-ఛైర్మన్ కె శ్రీనివాస్.. సిఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజ్ కోసం చేసిన 30/2023 చట్టానికి అనుబంధంగా ప్రభుత్వం జిఓ 114ను విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిన రెగ్యులరైజేషన్ ప్రక్రియను పునరుద్ధరించాలని కోరారు. 2024, 2025 సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న మే నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. రెగ్యులరైజేషన్ పెండింగ్ అంశాన్ని పరిశీలనతోపాటు మే నెలల పెండింగ్ వేతనాలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు జెఎసి నేతలు తెలిపారు.

తగ్గిన 'ఉపాధి హామీ' పని దినాలు

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ఉపాధి హామీలో ఏనాడూ లేనంతగా ఈ ఆర్థిక సంవత్సరంలో పని దినాలు గణనీయంగా తగ్గాయని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చిందే అట్టడుగున ఉన్న దళిత, గిరిజన, బలహీన వర్గాల కుటుంబాలను ఆదుకోవడానికి అని పేర్కొన్నారు. గడిచిన 20 ఏళ్లలో లేనంతగా ఈ ఏడాది దళిత కుటుంబాలు 18.7 శాతం, గిరిజన కుటుంబాలు 17 శాతం పనులకు దూరమయ్యారన్నారు. రాష్ట్రంలో ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ.435 కోట్లు నిధులు పేదలకు అందకుండా పోయాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అనేక రకాల కుట్రలు చేస్తున్నాయన్నారు.

ప్రభుత్వమే పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేయాలి

- వైసిపి నేతల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆర్యవైశ్యుల దగ్గర చందాలు వసూలు చేయడం దారుణమని, ప్రభుత్వమే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వైసిపి నాయకులు కోరారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి శనివారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లేళ్ల అప్పిరెడ్డి, వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. అమరావతిలో ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు డిపిఆర్‌కు రూ.11 కోట్లు వెచ్చించారని, పొట్టి శ్రీరాములు విగ్రహానికి చందాలు వసూలు చేస్తున్నారని తెలిపారు.

పౌరసత్వం కోసం రూ.800

కౌంటర్లు తెరిచిన బెంగాల్ బిజెపి నేతలు

కొల్‌కతా : అది పశ్చిమ బెంగాల్‌లో ఉత్తర 24 పరగణాల జిల్లా ఠాకూర్‌నగర్‌లో ఉన్న మతువా మహాసంఘ కార్యాలయం. అక్కడ పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) పేరిట ఓ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. సిఎఎ ఫారం కావాలంటే ఇరవై రూపాయలు, దానిని పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలంటే మరో రూ.800 చెల్లించాలి. అలా చేస్తే ఫారం తిరస్కరణకు గురయ్యే అవకాశమే ఉండదని గ్యారంటీ ఇస్తారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఈ కార్యాలయం గత రెండు నెలలుగా జనం రాకపోకలతో కళకళలాడుతోంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి శంతను ఠాకూర్, ఆయన సోదరుడు సుబ్రత సహా పలువురు బిజెపి నేతలు ఆ శిబిరంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అక్కడ 'మతువా గుర్తింపు కార్డు', 'హిందూ గుర్తింపు కార్డు'ల పంపిణీ జరుగుతుందని ప్రచారం చేశారు. హరిన్‌ఘటాకు చెందిన బిజెపి ఎమ్మెల్యే అశిం సర్కార్ నదియాలో ఇలాంటి శిబిరాన్నే స్వతంత్రంగా నిర్వహిస్తున్నారు.


బిజెపి బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి శంతను ఠాకూర్

బెంగాల్‌లో మతువా సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని వందలాది శిబిరాలను ఏర్పాటు చేశారు. దళిత హిందువులైన మతువాలు దశాబ్దాల క్రితమే బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చారు. వీరు ఇప్పటికీ పౌరసత్వం, గుర్తింపు తదితర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సీఏఏ లబ్దిదారులను సమీకరించడానికి బిజెపి ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 700కు పైగా సీఏఏ సహాయ శిబిరాలను ఏర్పాటు చేస్తామని గత నెల ప్రారంభంలోనే బిజెపి ప్రకటించింది. మతువాలు ఎక్కువ సంఖ్యలో ఉన్న ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేశారు. సీఏఏ కింద పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రతి రోజూ సగటును ఐదు వందల మంది తమ శిబిరాలకు వస్తున్నారని రాష్ట్ర బిజెపి ప్రతినిధి దేవ్‌జిత్ సర్కార్ చెప్పారు.

సిఎఎ ఫారం, 6బి ఫారం అప్‌లోడ్ చేయడానికి ఈ శిబిరాలలో బిజెపి కార్యకర్తలు, మద్దతుదారులను నియమించారు. అందుకోసం వారికి శిక్షణ కూడా ఇచ్చారు. అయితే మతువాలు దీనిపై పెద్దగా సంతోషించడం లేదు. ఇదంతా రాజకీయమని, జేబులు నింపుకోవడానికి ఇదో దారిగా మారిందని వారు వ్యాఖ్యానించారు. దరఖాస్తుదారుల నుంచి డబ్బు తీసుకుంటున్న మాట నిజమేనని బిజెపి నేతలు అంగీకరించారు. శిబిరాలలో పనిచేసే వారికి వేతనాలు ఇవ్వాలి కదా అన్నది వారి వాదన. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ ప్రక్రియను సిఎఎతో ముడి పెట్టాలని బిజెపి ప్రయత్నిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. బెంగాల్‌లో మరో ఆరు నెలల కాలంలో శాసనసభ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రజల మద్దతును పెంచుకోవడానికి బిజెపి అన్ని ప్రయత్నాలు చేస్తోంది. సిఎఎపై ఇచ్చిన హామీతోనే మతువాలు 2019 శాసనసభ ఎన్నికలలో బిజెపి కి మద్దతు తెలిపారు.

జీవనోపాధులు మెరుగుపర్చేందుకు కృషి

- సిపిఎం బీహార్ మేనిఫెస్టో విడుదల

పాట్నా : కేంద్రంలోనూ, బీహార్‌లోనూ అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయని, అందుకనే ప్రజల సమస్యల ఊసెత్తకుండా ప్రతిపక్ష నేతలను వ్యక్తిగతంగా ప్రతిష్ట దిగజార్చే నీచమైన అసత్య ప్రచారాన్ని ఎన్‌డిఎ నేతలు చేస్తున్నారని సిపిఎం సీనియర్ నాయకులు బృందాకరత్ విమర్శించారు. సిపిఎం ఎన్నికల ప్రణాళిక (మేనిఫెస్టో)ను శనివారం నాడు స్థానిక నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బృందాకరత్ మాట్లాడుతూ బీహార్ ప్రజల జీవనోపాధులు మెరుగపర్చేందుకు, అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాలను మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు తెలిపారు. ఉద్యోగాల సృష్టికి మహాగట్బంధన్ కట్టుబడివుందన్నారు. ఆ లక్ష్యాల సాధనలో సిపిఎం తనవంతు కృషిని పోషిస్తుందని ఆమె తెలిపారు. బీహార్ ఎన్నికల్లో ఎన్‌డిఎ చేస్తున్న దుష్ప్రచారాన్ని కూడా ఆమె ఎండగట్టారు. బీహార్‌లో రెండు దశాబ్దాల పాటు పాలన సాగించిన ఎన్‌డిఎ నేతలు ప్రజలకు చేసిందేమీ లేదని, సాధించిన ప్రగతి లక్ష్యాలే ఏమీ లేవని, అందుకనే ప్రతిపక్షాల అభాండాలు మోపుతూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. జన్ సురాజ్ పార్టీ మద్దతు దారుడు దులార్ ఛంద్ యాదవ్ హత్యకు గురికావడం, జెడియు అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ ప్రమేయమున్నట్లు వస్తున్న కథనాలపై ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలకు ఈ ఘటన నిదర్శనమన్నారు. ఎన్‌డిఎ పాలనలోనే బీహార్‌లో మాఫియా రాజ్, జంగిల్ రాజ్ నడుస్తోందనేందుకు ఇదే ఉదాహరణ అని ఆమె అన్నారు. కాంగ్రెస్ నేత గౌరవ్ గగోయిని 'పాక్ ఏజెంట్' అంటూ అస్సాం ముఖ్యమంత్రి బిశ్వాస్ శర్మ సహా బిజెపి నేతలు ప్రతిపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకొని చేస్తున్న అనైతిక వ్యాఖ్యల పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.


సిపిఎం మేనిఫెస్టోను విడుదల చేస్తున్న బృందా కరత్ తదితరులు



ప్రజాస్వామ్య దేశాల్లో హింసకు చోటు లేదు

- తేజస్వియాదవ్

పాట్నా : త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బీహార్‌లోని మొకామాలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచారంలో జన సురాజ్ పార్టీ కార్యకర్తలకు, ఎన్‌డిఎ కూటమి కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలు జరిగాయి. దీంతో జన సురాజ్ పార్టీ కార్యకర్త దులార్ చంద్ యాదవ్‌పై కాల్పులు జరపడంతో అతను చనిపోయాడు. ఈ ఘటనను రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నేత తేజస్వియాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశాల్లో హింసకు చోటు లేదు. ఆయుధాలతో 40 - వెహికల్ కాన్వాయ్ వెళ్లడం చూసి మేము ఆశ్చర్యపోయాము. ఎన్నికల సంఘం ఏం చేస్తోంది? రాష్ట్ర పరిపాలన ఏం చేస్తోంది? దీనిపై ఇప్పటివరకు ఏం చర్యలు తీసుకున్నారు? అక్కడ హత్య జరిగింది. దీనికి సాక్షులు చాలామంది ఉన్నారు. కానీ పరిపాలన మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. నిశ్శబ్దంగా ఉంది. ఈ ఘటనపై దర్యాప్తు లేదు. గూండాలను రక్షిస్తున్నదెవరు? అని ఆయన ప్రశ్నించారు.

ఆదరిస్తే 150.. తిరస్కరిస్తే 10 : ప్రశాంత్ కిశోర్

పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీని ప్రజలు ఆదరిస్తే 150 స్థానాల్లో విజయం సాధిస్తామని, తిరస్కరిస్తే కనీసం 10 స్థానాలైనా దక్కించుకుంటామని జన్ సురాజ్ పార్టీ (జెఎస్‌పి) అధినేత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. జెఎస్‌పి అభ్యర్థుల తరపున వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్న ఆయన శనివారం ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు జన్ సురాజ్‌ను ఒక ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని, అయితే దీర్ఘకాలంగా నిరాశావాదాన్ని చూసిన ఓటర్లు ముందడుగు వేయడానికి విశ్వాసం అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల్లో తాను చేయకపోయినా..160 నుంచి 170 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎన్‌డిఎకి, మహాగట్బంధన్‌కి గట్టి పోటీ ఇవ్వనున్నారని తెలిపారు.



ఎన్‌డిఎవి విభజన రాజకీయాలు

- బెగుసరాయ్ ర్యాలీలో ప్రియాంక గాంధీ విమర్శ

బెగుసరాయ్ : కేంద్రంలో, బీహార్‌లో గల ఎన్‌డిఎ ప్రభుత్వం విభజన రాజకీయాలకు పాల్పడుతోందని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ శనివారం విమర్శించారు. ఈ ఎన్నికల్లో గెలుపొందేందుకు బూటకపు జాతీయవాదాన్ని ప్రచారం చేస్తోందన్నారు.

బెగుసరాయ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం లేదన్నారు. ప్రతీదీ ఢిల్లీ నుండే నియంత్రించబడుతోందన్నారు. బీహార్‌లోని ఎస్‌ఐఆర్‌పై కూడా ఆమె విమర్శలు చేశారు. ఓటర్ల పేర్లు తొలగించడం ప్రజల హక్కులను ఉల్లంఘించడమే కాగలదని అన్నారు. "ముందుగా వారు ప్రజలను విభజిస్తారు. యుద్ధానికి వెళతారు. కానీ వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించలేరని అన్నారు. అందుకే వారు ఇప్పుడు ఓట్లను చోరీ చేస్తున్నారన్నారు. నెహ్రూ, ఇందిరలను బిజెపి వారు విమర్శిస్తారు, కానీ నిరుద్యోగం, వలసలు వంటి సమస్యలను పరిష్కరించలేరని విమర్శించారు. దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడిన బీహార్ రాష్ట్రంలో మాత్రం ఎలాంటి వృద్ధి లేదన్నారు. బీహార్ ప్రభుత్వం ఇచ్చే హామీలతో ఫూల్స్ కావద్దని ప్రియాంక హెచ్చరించారు. విచ్చలవిడిగా ప్రైవేటీకరణ విధానాలు అమలు చేస్తూ తన కార్పొరేట్ మిత్రులకు బడా పిఎస్‌యులను కట్టబెడుతున్నారని ప్రధానిపై తీవ్రంగా ధ్వజమెత్తారు.



ముంబయిలో ఎంవిఎ-ఎంఎన్ఎస్ ర్యాలీ

ముంబయి : ఓటర్ల జాబితాలో అవకతవకలను నిరసిస్తూ మహా వికాస్ అగాధి, మహారాష్ట్ర నవ నిర్మాణ సేన శనివారం నిరసన ర్యాలీ నిర్వహించాయి. సత్యం కోసం ప్రదర్శన (సత్యచా మోర్చా) పేరుతో సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్, శివసేన(యుబిటి), ఎన్‌సిపి(ఎస్‌పి) కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్‌సిపి ఎంపి సుప్రియా శూలే, కాంగ్రెస్ నేతలు నసీమ్ ఖాన్, సతేజ్ పాటిల్ సహా పలువురు నేతలు వేలాదిమంది కార్యకర్తలు వెంట రాగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

'షట్‌డౌన్'లో ఆహార సాయం ఆపలేరు

- అమెరికా కోర్టుల రూలింగ్

వాషింగ్టన్ : లక్షలాది మంది పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలకు అందజేస్తున్న ఆహార సాయాన్ని ప్రభుత్వ షట్‌డౌన్ సాకుతో ఎలా నిలిపివేస్తారని అమెరికా కోర్టులు శుక్రవారం ట్రంప్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. ఆహార సాయాన్ని ఆపకూడదని రూలింగ్ ఇచ్చాయి. కంటింజెన్సీ నిధుల నుంచి సొమ్ము తీసుకొని ఆహార సాయాన్ని కొనసాగించాలని ఆదేశించాయి. అమెరికాలో 42 మిలియన్ల మంది...అంటే ప్రతి ఎనిమిది మంది పౌరుల్లో ఒకరు...తమ కుటుంబ ఆహార అవసరాల కోసం ప్రభుత్వ సాయంపై ఆధారపడుతున్నారు. అయితే ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఈ సాయాన్ని శనివారం నుంచి నిలివేయాల్సి వస్తుందని ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే తెలిపాయి. బోస్టన్‌లోని అమెరికా జిల్లా జడ్జి ఇందిరా తల్వానీ, రోడ్ ఐలాండ్ జిల్లా కోర్టు జడ్జి జాన్ మెక్‌నెల్ ఒకే రోజు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రూలింగ్ ఇచ్చారు. ఆహార సాయానికి సంబంధించిన స్నాప్ పథకానికి ఏ విధంగా నిధులు సమకూరుస్తారో సోమవారం లోగా తెలియజేయాలని ప్రభుత్వానికి ఇందిరా తల్వానీ గడువు విధించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయడం చట్టవిరుద్ధమని ఆమె స్పష్టం చేశారు. డెమొక్రాట్ల పాలనలో ఉన్న ఇరవై ఐదు రాష్ట్రాలతో పాటు కొలంబియా జిల్లా దాఖలు చేసిన పిటిషన్‌ను పురస్కరించుకొని తల్వానీ ఈ ఆదేశాలు జారీ చేశారు. కాగా కంటింజెన్సీ నిధులను ఉపయోగించి స్నాప్ పథకాన్ని కొనసాగించాల్సిందేనని మెక్‌నెల్ తన రూలింగులో తెలిపారు. కోర్టులు జారీ చేసిన ఆదేశాలపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ కంటింజెన్సీ నిధులు వాడుకోవడం చట్టవిరుద్ధమని చెప్పుకొచ్చారు. ఇదిలావుండగా అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ శనివారం 32వ రోజుకు చేరింది.

నైపుణ్యాలను హరిస్తున్న హిందీ, ఇంగ్లీష్

- మాతృభాషలో విద్యాబోధన ప్రోత్సాహానికి చట్టం అవసరం
- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు : మాతృభాషేతర మాధ్యమాల్లో విద్యా బోధన కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో పిల్లల నైపుణ్యాలు బలహీనపడుతున్నాయని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంగ్లీష్, హిందీ భాషలు దక్షిణాది రాష్ట్రాల్లో పిల్లల నైపుణ్యాలను బలహీనపరుస్తున్నాయని, విద్యా సంస్థల్లో మాతభాషను ప్రోత్సహించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకపై వివక్షపూరిత వైఖరిని ప్రదర్శిస్తూ.. హిందీని బలవంతంగా రుద్దుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివద్ధి చెందిన దేశాల పిల్లలు తమ మాతభాషలోనే నేర్చుకుంటారని.. కానీ మన దేశంలో పరిస్థితి దానికి విరుద్ధంగా ఉందన్నారు. ఇంగ్లీష్, హిందీ పిల్లల ప్రతిభను బలహీనపరుస్తున్నాయన్నారు. ఈ సమస్యను నివారించాలంటే మాతభాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెడుతూ.. చట్టాలను తీసుకురావాలన్నారు. కన్నడ భాష దాని సంస్కృతిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని సిద్ధరామయ్య నొక్కి చెప్పారు. విద్య విషయంలో కన్నడ భాషపై జరుగుతున్న నిర్లక్ష్యం రాష్ట్రంలో అనేక సమస్యలకు కారణమయ్యిందన్నారు. హిందీ, సంస్కృత భాషాభివద్ధికి నిధులు కేటాయిస్తున్న కేంద్రం.. దేశంలోని ఇతర భాషల అభివద్ధికి మాత్రం ఎటువంటి గ్రాంట్లు మంజూరుచేయకుండా అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం కేంద్రానికి రూ.4.5 లక్షల కోట్ల ఆదాయాన్ని అందిస్తున్నప్పటికీ.. బిజెపి నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం కర్ణాటక అభివద్ధికి నిధులివ్వడానికి నిరాకరిస్తోందని తెలిపారు.


బెంగళూరు సభలో ప్రసంగిస్తున్న సిద్ధరామయ్య

ఆర్థిక సహకారం బలోపేతం

- అపెక్ డిక్లరేషన్ పిలుపు

జియోంగ్జు (దక్షిణ కొరియా) : సుస్థిర భవిష్యత్తు కోసం సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలనే అంశంపై రెండు రోజులుగా జరిగిన అపెక్ (ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకారం) సదస్సు శనివారంతో ముగియడంతో అపెక్ నేతలు ఉమ్మడి డిక్లరేషన్‌ను ఆమోదించారు. 'నేడు ప్రపంచ దేశాలు కీలకమైన మలుపులో నిలిచిన తరుణంలో, అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ గణనీయమైన సవాళ్ళను ఎదుర్కొంటోంది. అదే సమయంలో పరివర్తనా సాంకేతికతలు వేగవంతమైన పురోగతి సాధించడం, జనాభాలో మార్పులు ఇవన్నీ కలిసి అపెక్ సభ్య దేశాల ఆర్థిక వ్యవస్థలకు తీవ్రమైన, దీర్ఘకాలిక పర్యవసానాలను కలిగిస్తున్నాయి." అని జియోంగ్జు డిక్లరేషన్ పేర్కొంది.

అందరికీ లబ్ధి చేకూర్చేలా ఆర్థిక వృద్ధి సాధించేందుకు సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని, నిర్దిష్ట కార్యాచరణ చేపట్టాలని డిక్లరేషన్ పిలుపిచ్చింది. ఈ డిక్లరేషన్‌తో పాటూ అపెక్ నేతలు విడివిడిగా రెండు డాక్యుమెంట్లను ఆమోదించారు. అందులో ఒకటి అపెక్ కృత్రిమ మేథస్సు చొరవ కాగా రెండోది జనాభా మార్పులకు సంబంధించిన అపెక్ సహకార ఫ్రేమ్‌వర్క్.


సదస్సు ముగింపు సందర్భంగా ఆసియా - పసిఫిక్ దేశాల అధినేతల గ్రూప్ ఫొటో

వచ్చే ఏడాది షెంజాన్ ఆతిథ్యం

వచ్చే ఏడాది నవంబరులో జరిగే అపెక్ ఆర్థిక నేతల సదస్సుకు చైనా నగరం షెంజాన్ ఆతిథ్యమివ్వనున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శనివారం ప్రకటించారు. 32వ అపెక్ ఆర్థిక నేతల సమావేశంలో అపెక్ ఛైర్మన్ బాధ్యతలను అప్పగించే సమయంలో ఈ ప్రకటన చేశారు.

ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో అపెక్ అత్యంత ముఖ్యమైన ఆర్థిక సహకార యంత్రాంగం అని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. ప్రాంతీయ వృద్ధికి, సంక్షేమానికి అపెక్ గణనీయమైన సేవలందించిందన్నారు. దీర్ఘకాలిక అభివృద్ధికే కాకుండా ఈ ప్రాంత సంక్షేమానికి కూడా ఇది చాలా కీలకమన్నారు. ఉమ్మడి భవిష్యత్తుతో కూడిన ఆసియా-పసిఫిక్ కమ్యూనిటీని నిర్మించేందుకు అన్ని పక్షాలతో కలిసి పనిచేయడానికి చైనా సుముఖంగా వుందన్నారు. సభ్య దేశాల నేతలందరూ కూడా చైనా అభిప్రాయానికి మద్దతునిచ్చారు.

పలాసలో ఘోరం

(మొదటిపేజి తరువాయి)

విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కెవి.మహేశ్వరరెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మాజీ మంత్రి, వైసిపి నాయకులు డాక్టర్ సిదిరి అప్పలరాజు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం వివిధ ఆస్పత్రులకు పంపారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాసు పలాస ప్రభుత్వాస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.

ఇంతమంది వస్తారని ఊహించలేదు : ధర్మకర్త

ఇంతమంది వస్తారని ఊహించలేదు. ప్రతిరోజూ మూడు నుంచి ఐదు వేల మంది యాత్రికులు దర్శనానికి వస్తుంటారు. ఒక్కసారిగా అంతమంది రావడంతో పరిస్థితి అదుపు తప్పింది.

-హరిముకుంద పండా, ఆలయ ధర్మకర్త

మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా

ఆలయంలో తొక్కిసలాట ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షలు చొప్పున నష్టపరిహారం ప్రకటించగా, కేంద్ర ప్రభుత్వం రూ.రెండు లక్షలు ప్రకటించింది. గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.మూడు లక్షలు చొప్పున, కేంద్ర ప్రభుత్వం రూ.50 వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాయి.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : చంద్రబాబు

కాశీబుగ్గ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తొక్కిసలాటలో చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

యాత్రికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

తొక్కిసలాట ఘటన పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నపిల్లలు ఉండటం విచారకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో అనేకమంది తీవ్రంగా గాయపడ్డారని, చనిపోయిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం ఏకాదశి కావడంతో పెద్ద సంఖ్యలో యాత్రికులు వస్తారని తెలిసినా ముందస్తు ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకుల వైఫల్యం కనిపిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కనిపిస్తోందని, ఆలయాల్లో యాత్రికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం

ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి తక్షణమే నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్‌కర్ ఆదేశించారు. ఇందుకుగానూ టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఎఎస్‌పి కెవి.రమణ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ తో విచారణ బృందాన్ని నియమించారు.

నిర్వాహకుల వైఫల్యమే కారణం : మంత్రి లోకేష్

తొక్కిసలాట ఘటన నేపథ్యంలో పలాస ఆస్పత్రికి చేరుకున్న మంత్రి లోకేష్ సహాయక చర్యలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుడి నిర్మాణంలో లోపాలు, నిర్వాహకుల వైఫల్యమే ఈ ఘటనకు కారణమని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు మట్టి ఖర్చుల కింద తక్షణ సహాయంగా పది వేల రూపాయల చొప్పున సాయం పరిహారం అందిస్తామన్నారు. మృతుల్లో ముగ్గురు టిడిపి సభ్యులున్నారని, పార్టీ తరపున రూ.5 లక్షల చొప్పున సాయం అందనుందని తెలిపారు.

గవర్నర్ తీవ్ర దిగ్భ్రాంతి

కాశీబుగ్గ ఘటన పట్ల గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

నిర్లక్ష్యంతో ప్రాణాలు తీస్తున్నారు : మాజీ సిఎం వైఎస్ జగన్

తొక్కిసలాట ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ సిఎం వైఎస్ జగన్ తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. సహాయక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పార్టీ నాయకత్వానికి సూచించారు. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి తొక్కిసలాటలో ఆరుగురు, సింహాచలంలో గోడ కూలి ఏడుగురు మరణించారని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు వరుసగా జరుగుతున్నా ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నారన్నారు.

తీవ్ర పేదరిక విముక్త రాష్ట్రంగా కేరళ ఘనకీర్తి

(మొదటిపేజి తరువాయి)

64,006 కుటుంబాలకు చెందిన 1,03,099 మందిని తీవ్రమైన పేదలుగా గుర్తించాం. ఆహారం, ఆరోగ్యం, ఇల్లు, ఆదాయం వంటి అంశాలను కీలకమైనవిగా భావించి వాటి ప్రాతిపదికన తీవ్రమైన పేదలను గుర్తించామని, ప్రతి ఒక్క కుటుంబానికి సూక్ష్మ ప్రణాళికలు సిద్ధం చేశామని విజయన్ చెప్పారు.

ఇపిఇపి తొలి దశలో 21,263మందికి కీలకమైన డాక్యుమెంట్లు అందచేశాం. రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు వంటి కనీస డాక్యుమెంట్లు కూడా లేకుండా ఇబ్బంది పడుతున్న వీరికి తక్షణమే వాటిని అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కుటుంబశ్రీ కార్యక్రమం ద్వారా 20,648 తీవ్రమైన పేద కుటుంబాలకు ఆహారం క్రమం తప్పకుండా అందేలా చూశామన్నారు. అలాగే ఆరోగ్య సేవలు, అందుబాటులో మందులు, వ్యాక్సినేషన్లు, ఉపశమనం కలిగించే సంరక్షణ చర్యలు, అవయవాల మార్పిడి వంటి వాటికి హామీ కల్పించామని ముఖ్యమంత్రి చెప్పారు. లైఫ్ మిషన్ కింద 4,677 కుటుంబాలకు ఇళ్ళు కట్టించామన్నారు. మరో 2,713 కుటుంబాలకు ఇల్లు, భూమి రెండూ అందచేశామన్నారు. 4,394 కుటుంబాలకు జీవనోపాధి కల్పించామన్నారు. మొత్తంగా మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) లో 35,041 కుటుంబాలను భాగస్వామ్యం చేశాం. విద్యా శాఖ ద్వారా 5,583 మంది పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టే పథకాన్ని తీసుకువచ్చామన్నారు. విద్యా అవసరాల కోసం వారు ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పించామన్నారు. 331 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందచేశామన్నారు. మొత్తంగా 428 ఏకసభ్య కుటుంబాలను సురక్షితమైన షెల్టర్ హోమ్‌లకు తరలించామన్నారు.

దారిద్ర్యం, అధిక జననాల రేటు వంటి సమస్యలను కేరళ ఎదుర్కొంటోందని పేర్కొంటున్న 1970ల నాటి అకడమిక్ జర్నల్స్, ఐక్యరాజ్య సమితి నివేదికలను ఉటంకిస్తూ విజయన్, ఆనాటి రోజుల నుండి రాష్ట్రం ఇప్పుడు ప్రశంసనీయమైన పురోగతిని సాధించిందని చెప్పుకొచ్చారు. వ్యవసాయ కార్యకలాపాల్లో సంస్కరణలు, ఆరోగ్య, విద్యా రంగాల్లో ప్రభుత్వ ప్రమేయం వంటి చర్యల ద్వారా, ప్రగతిశీల ప్రభుత్వాలు, ప్రజా ఉద్యమాలు నిరంతరంగా జోక్యం చేసుకోవడం ద్వారా ఈ పురోగతిని సాధించడం జరిగిందన్నారు. 'గర్వకారణమైన ఈ విజయం మన కేరళ ప్రజలందరిదీ. ఆ చారిత్రక క్షణాన్ని మనం ఈనాడు చూస్తున్నాం' అని పినరయి విజయన్ పేర్కొన్నారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం వెయ్యి కోట్లకు పైగా ఖర్చు పెట్టిందన్నారు.

జీర్ణించుకోలేని యుడిఎఫ్

తీవ్ర దారిద్ర్యం లేని రాష్ట్రంగా అవతరించిన నేపథ్యంలో కేరళకు సర్వత్రా అభినందనలు వస్తుంటే అక్కడి కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ మాత్రం జీర్ణించుకోలేకపోయింది. శాసనసభలో ప్రతిపక్ష నేత విడి సతీశన్ మాట్లాడుతూ 'ఒక ప్రకటన చేయడానికి శాసన సభ ప్రత్యేక సమావేశాల ఏర్పాటు చేయడంలో ఔచిత్యమేంటని' ప్రశ్నించారు. ఇదొక బూటకపు ప్రకటన అని అక్కసు వెళ్లగక్కారు.

అభినందనల వెల్లువ

తీవ్ర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ చరిత్రపుటలకెక్కిన నేపథ్యంలో వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వానికి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ ప్రకటన సందర్భంగా తిరువనంతపురంలోని నిశాగంధీ ఆడిటోరియయంలో మంత్రి కె రాజన్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభను ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించారు. ఈ సభకు మళయాళ ప్రసిద్ధ నటులు మమ్ముట్టి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆకలితో అలమటిస్తున్న ప్రజలున్నంత కాలంలో ఎంతటి అభివృద్ధి సాధించినా అది అభివృద్ధి అనిపించుకోదని ఆయన అన్నారు.

పెద్ద పెద్ద ఆకాశహర్మ్యాలు, నిర్మాణాలు చేపట్టినంతనే అది అభివృద్ధి కాబోదన్నారు. తీవ్ర పేదరికం నిర్మూలించడం గొప్ప ముందడుగు అని ప్రశంసించారు. ఇక పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరు భుజంభుజం కలిపి కలిసికట్టుగా కృషి చేయాల్సివుందన్నారు. అనేక సామాజిక, సంక్షేమ సూచీల్లో కేరళ..ప్రపంచానికే ఆదర్శనంగా నిలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం 'తీవ్ర పేదరిక రహితంగా కేరళ' లక్ష్యాన్ని సాధించిన తీరు తెన్నులపై రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రి విజయన్..మమ్ముట్టికి అందజేశారు.

కేరళ ఖ్యాతి చిరస్మరణీయం : ఎంఎ బేబీ

కేరళ ప్రజానీకానికి, ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కేరళ సాధించిన ఈ విజయం చరిత్ర పుటల్లో చెరగని సువర్ణాక్షరాలతో లిఖితమైందని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియోను ఆయన విడుదల చేశారు. కేరళ చరిత్రలోనే కాకుండా యావత్ భారతదేశ చరిత్రలోనే నవంబరు 1, 2025 చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. తీవ్ర దుర్భిక్షంలో బతుకెళ్లదీసిన నిరుపేదల జీవనోపాదులను మెరుగుపర్చి సమిష్టి కృషితో కేరళ ఈ ఘనత సాధించిందని ఆయన కొనియాడారు. సగర్వనీయమైన ఈ విజయం ద్వారా కేరళ ప్రజానీకం మరింత విశ్వాసంతో ఇతర సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తుందని బేబీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఊరు వల్లకాడు చేస్తారా?

(మొదటిపేజి తరువాయి)


చెబుతున్నారని తెలిపారు. ఆమె ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తప్పి వెన్నుపోటు పొడుస్తున్నందుకు వారంతా ఆగ్రహించారని తెలుసుకోవాలన్నారు. ప్రజలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, రాజయ్యపేట గ్రామాన్ని స్వేచ్ఛగా ఉంచి, హోం మంత్రి అనిత చర్చలకు పిలవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉచ్చులో రాష్ట్ర ప్రభుత్వం ఇరుక్కొందని, మోడీ మెహర్బానీ కోసం భూ సేకరణ చేపట్టిందని విమర్శించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కాపాడేందుకే ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. పోలీసు బలగాలను మొహరించి ఉద్యమాలను అణచివేయలేరని తెలిపారు. పేదరికం, వెనుకబాటుతనం ఉన్న ప్రాంతాల్లో విషతుల్య పరిశ్రమలు ఏర్పాటుచేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అనకాపల్లి ఎంపి సిఎం రమేష్‌కు మత్స్యకారుల ఘోష వినిపించడం లేదా? అని ప్రశ్నించారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పోలా ఈశ్వరరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు ఎంఎస్.నాగరాజు, ఎస్‌వియుసిఐ నాయకులు గోవిందరాజులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మహిళా సమాఖ్య నాయకులు విమల మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.



ఊహలు ఊరేగుతున్నాయి



చుక్కమ్మ తన మనవడు సముద్రాన్ని కష్టపడి పెంచి పెద్ద చేసింది. వాడు చిన్నప్పటి నుండి పగటి కలలు కంటూ ఊహల్లో తేలేవాడు. అలా సముద్రం పాతికేళ్లవాడు అయ్యాడు. ఒకరోజు చుక్కమ్మ మనవడితో 'నాయనా నేను ముసలిదాన్ని అయిపోయాను. కూలీనాలీ చేసి సంపాదించలేను. నువ్వు కష్టపడి కాణీయో పరకో సంపాదిస్తేనే ఆ పూటకు గంజి. లేకుంటే మనం పస్తులుండడమే' అని చెప్పింది.

'మామ్మా! నువ్వేమీ బెంగపడకు. నేను పని చేసి బాగా డబ్బులు సంపాదిస్తాను. నిన్ను బాగా చూసుకుంటాను' అన్నాడు సముద్రం. అన్నాడే గానీ ఏ రోజూ పని వెతుక్కోవడం కోసం బయటికి వెళ్లలేదు. ఇంట్లోనే మామ్మ భద్రపరిచిన సొమ్ముతో కాలక్షేపం చేస్తున్నాడు.

'మాటలు కోటలు దాటుతున్నాయి. కాళ్ళు గడప దాటలేదు. వీడు ఎప్పటికీ మారతాడో ఏమిటో' అని మామ్మ ఎన్నోసార్లు అనుకుంది. ఒకరోజు భోజన సమయంలో 'మామ్మా అన్నం పెట్టు ఆకలౌతోంది' అని అరిచాడు సముద్రం.

'అదేంటి కూర ఎంతో రుచికరంగా ఉందని, కడుపునిండా తిన్నావు కదరా!' అంది చుక్కమ్మ. సముద్రం పరుగున పరుగున పొయ్యి దగ్గరికి వెళ్ళి చూసాడు. గిన్నెలు ఖాళీగా ఉన్నాయి. పొయ్యిలో పిల్లి పడుక్కుని ఉంది. 'నేను తిన్నట్లు నువ్వు ఊహించుకుంటే నా ఆకలి తీరుతుందా మామ్మా!' అన్నాడు సముద్రం కోపంగా.

'ఓహో అలాగా! మరి నీ కాళ్ళు గడప దాటకుండా ఊహల్లో డబ్బులు సంపాదించడం నిజమైనప్పుడు ఇది ఎందుకు నిజం కాదు?' అని ఎదురు ప్రశ్న వేసింది చుక్కమ్మ. కష్టపడకుండా సోమరిపోతులా పగటి కలలు కంటూ ఉంటే కడుపు నిండదు కదా! కాయకష్టం చేసి డబ్బులు సంపాదించాలంటే కాళ్ళు గడప దాటాలి. నీలా సంపాదన లేకుండా ఊహల్లో ఊరేగే వాళ్ళని ఉద్దేశించి 'ఊహలు ఊరేగుతున్నాయి కానీ కాళ్ళు గడప దాటలేదు అనే సామెత వచ్చింది' అని వివరించింది చుక్కమ్మ. తన తప్పును తెలుసుకున్న సముద్రం కష్టపడి పనిచేసి వృద్ధాప్యంలో మామ్మకి అండగా నిలిచాడు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445

సరైన అక్షరం రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటిని ఇంగ్లీషులో ఏమంటారో పక్కన కొన్ని అక్షరాలు ఇచ్చాం. వాటిల్లో సరైన అక్షరం రాసి ఆ పదాన్ని కనిపెట్టండి చూద్దాం..



నేను గీసిన బొమ్మ





- షేక్ తస్మియా సర్వర్, 9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జీవన సౌరభం

ఏ సమస్యనైనా ఎదుర్కొనే మానసిక సామర్థ్యం అలవర్చుకోవాలి. అప్పుడు సమస్యలన్నీ చిన్నవిగా కనిపిస్తాయి.

మీ కోసం

చలికాలం చర్మం పొడిబారకుండా, పగుళ్లు రాకుండా ఉండాలంటే ఉదయం గోరువెచ్చని నీటిలో కొద్దిగా కొబ్బరి నూనె లేదా ఆలివ్ నూనె చుక్కలు వేసి స్నానం చేయాలి.



JEEVANA జీవన the family

ఛత్ రైలు.. వలస వెతల బండి!

స్పెషల్

ఛత్ ట్రైన్.. బీహార్‌లో ప్రతి ఏడాది నిర్వహించే ఛత్ పండుగ కోసం రైల్వే శాఖ ప్రతి ఏడాది ప్రత్యేకంగా నడుపుతుంది. బీహార్ నుండి దేశం నలుమూలలకి వలసవెళ్లిన కార్మికులు తిరిగి తమ రాష్ట్రానికి చేరుకోవడానికి ఈ రైలు వారధిలా ఉపయోగపడుతుంది. ఆయా రాష్ట్రాల నుండి 4 నుండి 5 రోజులు అంతకంటే ఎక్కువ రోజులు ప్రయాణించి మరీ వలసదారులు బీహార్ చేరుకుంటారు. ప్రతి ఏడాది ఇదే జరుగుతుంది. అయితే ఈసారి మాత్రం ఈ రైలు కేవలం పండుగ కోసమే కాదు, అంతకంటే ముఖ్యమైన దాని గురించి నడుపుతున్నారు. నవంబరు 6న బీహార్‌లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో ఆ రైలులో ప్రయాణిస్తున్న వలసదారులు తమ రాష్ట్రం గురించి, వాళ్ల కుటుంబాల గురించి మాట్లాడారు. ఒక్కొక్కరిది ఒక్కో కథ. అందరిదీ ఒకటే గాథ..



ఛత్ ట్రైన్‌ని 'వలసదారుల రైలు' అని కూడా పిలవచ్చు. ఎందుకంటే ఈ రైలులో ప్రయాణించే వాళ్లంతా వలసదారులే కాబట్టి. వీళ్ల గురించి తెలుసుకోవాలంటే రైలు ఎక్కడానికి ముందు నుండి మొదలుపెట్టాలి. బీహారీల కోసం వేసిన ఈ ప్రత్యేక రైలు కోసం గంటల తరబడి వాళ్లు క్యూలైన్లో నిల్చుంటారు. సామాన్లు భద్రపరుచుకోవడానికి సూట్‌కేసులు, బ్యాగులు వంటివేవీ వారి దగ్గర ఉండవు. నీళ్లకు వాడే డ్రమ్ముల్లో బట్టలు, సామాను పెట్టుకుంటారు. నెత్తిమీద, భుజం మీద వాటిని మోసుకుంటూ స్టేషనులో ఒక బ్లాక్ నుండి మరో బ్లాక్‌కి పరుగెడుతుంటారు. వ్యయప్రయాసలు పడి రైలు ఎక్కినా ప్రయాణించిన అన్ని రోజులూ చాలామంది నిలబడే ఉంటారు. రోజుల తరబడి తినరు. టాయిలెట్‌కి వెళ్లడం అసలు ఊహించలేం.

మనోజ్ చౌదరి (27) పూణెలో ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. బీహార్ సహ్రస జిల్లాలో ఉంటున్న తన గ్రామానికి చేరుకోవడానికి రైలు ఎక్కాడు. అతని ప్రయాణంలో మొత్తం మూడు రైళ్లు మారాలి. ఒక బస్సు ఎక్కాలి. ఊళ్లో తన కోసం భార్య, పిల్లలు, ముసలి తల్లిదండ్రులు ఎదురుచూస్తుంటారు. వాళ్లందరికీ మనోజ్ ఒక్కడే ఆదరువు. అతను తీసుకొచ్చే మొత్తంతోనే ఆ కుటుంబం అతను లేని రోజులని కూడా గడపాలి. ఇదంతా మనోజ్‌కి బాగా తెలుసు. అయినా ఏడాదికి రెండుసార్లు మాత్రమే బీహార్‌కి వస్తాడు. అంతకుమించి ప్రయాణించే స్థోమత అతనికి లేదు. పనిచేసే చోట సెలవులు కూడా మంజూరుకావు. ఈ ప్రయాణం గురించి మనోజ్ ఇలా చెప్పాడు. 'నాలుగు రోజుల నా ప్రయాణంలో రెండు సార్లు ఆహారం తీసుకున్నాను. నిద్ర పోలేదు. అయితే చివరిరోజు కాస్త సీటు దొరికింది. అదే చాలు అనుకున్నాను. ఎందుకంటే చాలామందికి అది కూడా దొరకదు. అలా నిల్చునే ప్రయాణిస్తారు. కాలు కదిపే చోటు లేక యూరిన్‌కి వెళ్లకుండా 30 గంటలు ఉండిపోయాను. ఇప్పుడే కాదు. ప్రతిసారీ ఇదే జరుగుతుంది' అంటున్న మనోజ్ రూ.700ల రోజువారీ కూలికి పనిచేస్తున్నాడు.

రైలు దిగి రైలు మారడం కూడా వీళ్లకి పెద్ద ప్రహసనం. రాజ్‌గిరి ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూస్తున్న క్రమంలో బ్లాక్ నెం 4 దగ్గరకి వస్తోన్న ఆ రైలుని అందుకోవడం కోసం సామాను, బట్టలు ఉన్న డ్రమ్ములని నెత్తిమీద మోసుకుంటూ వందలమంది అటువైపు పరుగులు పెట్టారు. వారిలో మనోజ్ ఒకడు. ట్రైన్‌ని చేరుకున్న వారు సీట్ల కోసం కిటికీల గుండా, ఎమర్జెన్సీ అద్దాలు పగలుకొట్టి మరీ వెళ్లడం టీవీ స్క్రీన్లపై సోషల్ మీడియా వీడియోల్లో ప్రతిసారి కనిపిస్తుంది.

చెన్నై, బెంగళూరు, పూణె, ఢిల్లీ, హైద్రాబాద్, గురుగావ్ తదితర ప్రాంతాల నుండి బీహార్‌కి చేరుకునే వలసదారులందరిదీ ఇదే పరిస్థితి! ట్రైన్ కోసం వేచి ఉండడం, సీట్ల కోసం పరుగులు పెట్టడం. విజయ్‌శంకర్ బెంగళూరులో 25 ఏళ్లుగా ఉంటున్నాడు. ప్రతి ఏడాది ఛత్ పండుగ కోసం బీహార్ వెళతాడు. నగరంలో ఉంటున్న అతను బీహార్ గురించి ఇలా చెప్పాడు.

'ఈ రైళ్లల్లో ప్రయాణిస్తున్న వలసదారులని చూస్తేనే బీహార్ పరిస్థితి అర్థమవుతుంది. ఎన్నికలు ఉన్నాయని ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యేక రైళ్లని నడుపుతోంది. కోటీ 50 లక్షల మంది ప్రయాణికులు వీటిలో ప్రయాణిస్తున్నారు. ఇదంతా మా ఓట్ల కోసమే. వాస్తవానికి బీహార్‌లో విద్య లేదు. ఆరోగ్య సంరక్షణ లేదు. నీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు కాస్త మెరుగుపడినా బీహార్‌కి ఇంకా కావాలి' అంటున్న విజయ్ బెంగళూరులో టీ దుకాణంలో పనిచేస్తున్నాడు.

బెంగళూరులోనే ఓ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వికాస్, అభిషేక్ 9 గంటలు వేచి చూసి ఈ రైలు ఎక్కారు. గ్రామం చేరుకోవాలంటే మూడు రోజులు రైలులోనే ప్రయాణించాలి. ఈ సమయంలో సామాను భద్రపరుచుకోవడం వాళ్లకి పెద్ద పరీక్ష. 'నిద్రపోకుండా వాటిని కాపాడుకుంటామ'ని వాళ్లు చెబుతున్నారు. నెలకి రూ.15 వేల జీతానికి ఎటువంటి సిక్‌లీవ్, బోనస్ లేకుండా వాళ్లు పనిచేస్తున్నారు. బీహార్‌లో వాళ్ల కుటుంబాలు సజావుగా నడవాలంటే బెంగళూరులో వాళ్లు పనిచేయాల్సిందే. వాళ్లకి వేరే అవకాశం లేదు. 'ఊళ్లో ఇళ్లని వదిలిపెట్టాలని మాకు లేదు. కానీ మా బతుకులు బాగోలేవు. అందుకే ఇంత దూరం ప్రయాణం చేసి వస్తున్నాం' అని అభిషేక్ చెబుతున్నాడు.

బీహార్‌లో పాలకులు గుప్పిస్తున్న వాగ్దానాలు, ప్రచారాలు తెలుసుకోవడానికి వీళ్లు స్మార్ట్‌ఫోన్లని ఉపయోగిస్తున్నారు. ఆ ప్రకటనల్లో 'బీహార్ వేగాన్ని పుంజుకుంటోంది' అని వినిపిస్తోంది. కానీ బీహార్‌కి వెళ్లే ఆ రైలు కూడా వేగంగా వెళ్లడం లేదు. ప్రకటనలపై మనోజ్ ఇలా అంటున్నాడు.. 'నేను బీహారిని అని యూట్యూబ్‌కి ఎలా తెలిసిపోయిందో నాకు అర్థం కావడం లేదు. అన్ని అక్కడి వార్తలే నాకు వస్తున్నాయి. రాజకీయ నాయకుల ప్రకటనలు వింటుంటే అవేవీ మమ్మల్ని బాగుచేయవు' అని అంటున్నాడు.

మోడీ ఏం చేయలేదు..

చెన్నైలో పనిచేస్తున్న సురేష్ పాశ్వాన్ కూడా ఈ రైలులో ఉన్నాడు. యూట్యూబ్ వీడియోలు చూస్తున్న అతను ఇలా అంటున్నాడు. 'బీహార్‌లో మోడీజీ ఏం చేయలేదని అక్కడి ప్రజలు అనుకుంటున్న వీడియోలు సోషల్‌మీడియాలో వస్తున్నాయి. కులం పేరుతో మేము బీహార్ గ్రామాల్లో వివక్షకి గురవుతున్నాం. మా జీవితాలు బాగుపడాలంటే సమర్థవంతమైన నాయకులు రావాలి. మా ఓటుతోనే అది జరగదు. మా గ్రామం ఏం కోరుకుంటుందో వాళ్లే నాయకులుగా వస్తారు' అని చెబుతున్నాడు.

బీహార్ నుండి బయటికి వెళ్లిన వలసదారులు అక్కడి విద్య, ఆరోగ్యం గురించి మాట్లాడడం లేదు. వారు ఫ్యాక్టరీలు, కంపెనీల గురించి ఆలోచిస్తున్నారు. ఇంటి దగ్గరే ఉండి కుటుంబాన్ని చూసుకోవాలంటే అదొక్కటే మార్గం.

ఆలస్యంగా వస్తోన్న రైళ్లని అందుకోవడం, సీట్ల కోసం పాట్లు పడడం, గంటల కొద్దీ తిండి, నీరు, విసర్జన లేక ఇబ్బంది పడుతున్న వారంతా కళావిహీనంగా, నైరాశ్యం నిండిన ముఖాలతో, పోషకాహారం లేక శుష్కించిన శరీరాలతో ఒంటికాళ్లపై గమ్యాన్ని చేరుకుంటున్నారు. అందరి మదిలో ఒకటే ప్రశ్న మెదులుతోంది. 'దేశాన్ని బీహార్ నిర్మిస్తోంది' అని పాలకులు గొప్పగా చెబుతున్నారు. మరి 'బీహార్‌ని ఎవరు నిర్మిస్తారు' అని!



దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ 2025

ఉత్తమ నటులుగా కార్తిక్ ఆర్యన్, కృతి సనన్

భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ప్రతిష్టాత్మకమైన దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ 2025 ప్రయివేట్ వేడుకలు ముంబైలో అట్టహాసంగా ముగిశాయి. ఉత్తమ నటుడిగా కార్తిక్ ఆర్యన్, ఉత్తమ నటిగా కృతిసనన్ అవార్డులు అందుకున్నారు. తెలుగు చిత్రం ప్రభాస్ నటించిన కల్కి ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. స్త్రీ 2 చిత్రం ఉత్తమ చిత్రంగా అవార్డు గెలుచుకుంది. అవార్డులను నటీనటులు, దర్శకులు, వివిధ విభాగాలకు చెందిన ప్రతినిధులు అందుకున్నారు. వివరాలు ఈ కింద ఉన్నాయి.

ఉత్తమ చిత్రం : స్త్రీ 2
ఉత్తమ నటుడు: కార్తిక్ ఆర్యన్ (చందు ఛాంపియన్)
ఉత్తమ నటి : కృతి సనన్
ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్ : కల్కి 2898 ఎడి
ఉత్తమ దర్శకుడు –కబీర్ ఖాన్ (చందు ఛాంపియన్)
క్రిటిక్స్ ఛాయిస్ బెస్ట్ ఫిల్మ్ : లాపతా లేడీస్
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్ : విక్రాంత్ మాస్సే
ఉత్తమ సంగీత దర్శకుడు : దేవిశ్రీ ప్రసాద్ (పుష్ప 2 ది రూల్)
ఉత్తమ వెబ్ సిరీస్ : హీరామండి
ఉత్తమ నటుడు (వెబ్ సిరీస్): జితేంద్ర కుమార్ (పంచాయత్)
ఉత్తమ నటి (వెబ్ సిరీస్) : హుమా ఖురేష (మహారాణి)
క్రిటిక్స్ ఛాయిస్ బెస్ట్ వెబ్ సిరీస్ : పంచాయత్ సీజన్ 3
ఉత్తమ నటి (క్రిటిక్స్–వెబ్ సిరీస్): సోనాక్షి సిన్హా (హీరామండి)
టెలివిజన్ సిరీస్ ఆఫ్ ది ఇయర్ : యే రిష్తా క్యా కెహ్లాతా హై
చిత్ర పరిశ్రమకు అత్యుత్తమ సేవ: సీనియర్ నటి జీనత్ అమన్
సంగీత పరిశ్రమకు అత్యుత్తమ సేవ: గాయని ఉషా ఉతుప్
ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ : సంగీత దర్శకుడు ఎఆర్ రెహమాన్
ఎక్సలెన్స్ ఇన్ ఇండియన్ సినిమా : నటి శిల్పా శెట్టి




14న 'స్కూల్ లైఫ్'

నైనిషా క్రియేషన్స్ బ్యానర్‌పై గంగాభవని నిర్మాతగా పులివెందుల మహేష్ హీరోగా స్వీయ దర్శకత్వంలో 'స్కూల్ లైఫ్' అనే చిత్రం తెరకెక్కింది. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న ఈ చిత్రం విడుదల కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో సావిత్రి, షన్ను హీరోయిన్స్‌గా నటించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలకపాత్రను పోషించారు. రిలీజ్ సమయం దగ్గరపడటంతో తాజాగా ఇందులో నుంచి ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడారు. 'సినిమాలు బ్రతకాలి. చిన్న సినిమాలను సపోర్ట్ చేయండి. భవిష్యత్తులో కొత్త వారి అందరికీ నా బ్యానర్ సపోర్ట్‌గా నిలుస్తుంది. సినిమాలలో హీరో కథ, బడ్జెట్ కాదు. క్రౌడ్ ఫండింగ్ చేసి ఈ సినిమాను పూర్తి చేసాము. మా సినిమా టికెట్ కేవలం వంద రూపాయలు మాత్రమే ఉండబోతుంది' అని తెలిపారు.



'పెద్ది' అచ్చియమ్మ

రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం నుండి తాజాగా జాన్వీ లుక్ విడుదలచేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మొదటి పాటను త్వరలో విడుదల చేయనున్నారు. ఇందులో జాన్వీకపూర్ అచ్చియమ్మగా కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రతిష్టాత్మకంగా సమర్పిస్తున్నారు. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ వంటి నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదల కానుంది.



'ఛాంపియన్'లా రోషన్ టీజర్

నటుడు శ్రీకాంత్ కుమారుడు రోషన్ కొత్త సినిమా 'ఛాంపియన్'. ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ మూవీని నిర్మిస్తున్నాయి. డిసెంబరు 25న రిలీజ్ కానున్న ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం డైరెక్ట్ చేస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఫుట్‌బాల్ ఆటగాడిగా రోషన్ నటిస్తున్నాడు. సంగీతం మిక్కీ జె.మేయర్ అందించారు.

కొత్త ఛాంపియన్ ఎవరో..?

- **నేడు భారత్ × దక్షిణాఫ్రికా మధ్య టైటిల్ పోరు**
- **మధ్యాహ్నం 3.00గం॥లకు**



నవీ ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ కొత్త ఛాంపియన్ ఎవరో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడడం ఇదే తొలిసారి. భారత మహిళలజట్టు రెండుసార్లు (2005, 2017లో) ఫైనల్‌కు చేరినా.. టైటిల్‌ను ముద్దాడలేకపోయింది. ముచ్చటగా మూడోసారి ఫైనల్‌కు చేరిన టీమిండియా టైటిల్ కొట్టాలని కోట్లాది అభిమానులు కోరుకుంటున్నారు. రెండు సార్లు ఆఖరి మెట్టుపై తడబడిన భారత్ ఈసారి ఎలాగైనా కప్‌ను ఒడిసిపట్టాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు దక్షిణాఫ్రికా మహిళలజట్టు కూడా తొలిసారి టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. దీంతో తొలిసారి ప్రపంచ కప్‌లో సరికొత్త అధ్యాయానికి ఈ రెండు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లను సెమీస్‌లో చిత్తుచేసి ఈ రెండుజట్లు ఫైనల్‌కు చేరడం గమనార్హం. దీంతో ఈసారి కొత్త ఛాంపియన్‌ను మనం చూడనున్నాం. ఆ 'కొత్త విజేత ఎవరు?' అని యావత్ క్రీడాభిమానులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. భారత్, దక్షిణాఫ్రికాల మధ్య ఆదివారం ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో టైటిల్ పోరు జరగనుండగా.. ఇరుజట్లలో ఎవరు గెలిచినా చరిత్ర సృష్టించడం ఖాయం. ఈ రెండు జట్ల మధ్య 34 వన్డేలు జరగ్గా.. 20 విజయాలతో భారత్ పైచేయి సాధించింది. ఆరు వన్డే ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో భారత్ మూడు విజయాలు సాధించింది. కానీ, దక్షిణాఫ్రికా గత మూడు మ్యాచ్‌ల్లో భారత్‌ను ఓడించడం గమనార్హం. 2017 తర్వాత ఈ గ్లోబల్ ఈవెంట్‌లో భారత్ చేతిలో ఓడిపోని ఏకైక జట్టు దక్షిణాఫ్రికా మాత్రమే. ప్రపంచ కప్ చరిత్రలో ఆస్ట్రేలియా(ఎనిమిది), న్యూజిలాండ్(ఐదు) మాత్రమే ఇంతకు ముందు కంటే ఎక్కువ సార్లు వరుస మ్యాచుల్లో భారత్‌ను ఓడించాయి. కాబట్టి భారత జట్టు ఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో వరుసగా మూడు సార్లు ఓడిపోయినందుకు ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది.

స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్, అమన్‌జోత్, స్నేహ్ రాణా, దీప్తి శర్మ.. బ్యాటింగ్ లైనప్ దుర్భేద్యంగా ఉంది. ఓపెనర్ ప్రతిక రావల్ స్థానంలో వరల్డ్‌కప్‌లోకి అనూహ్యంగా వచ్చిన షెఫాలీ వర్మ సెమీస్‌లో నిరాశపరిచింది. ఫైనల్లో ఆమె బ్యాట్‌నుంచి పరుగులు ధారాళంగా రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆఖర్లో రిచా ఘోష్ మెరిస్తే తిరుగుండదు. అయితే, దక్షిణాఫ్రికా బౌలింగ్ ఎటాక్‌ను భారత బ్యాటర్లు పంచుకుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయం సాధించడం తేలికవుతుంది. ఫైనల్‌కు ఐదుగురు ప్రధాన బౌలర్లు.. అదనంగా బౌలర్‌ను తీసుకుంటుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

సింగర్ సునిధి చౌహాన్ ప్రదర్శన



మహిళల వన్డే ప్రపంచకప్‌కు ముందు పాప్ సింగర్ సునిధి చౌహాన్ ప్రదర్శన ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ నవీ ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియం ఇప్పటికే పూర్తయ్యాయి. సునిధి చౌహాన్ పాటలతో, అద్భుతమైన లేజర్ షో కూడా ఏర్పాటు చేశారు. ఇక 350 డ్రోన్‌లతో ప్రదర్శన కూడా ఉండనుంది.

పొంచివున్న వర్షం ముప్పు?

ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. మ్యాచ్ జరిగే సమయంలో వరుణుడు అంతరాయం కలిగించే అవకాశమున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. దాంతో 50 ఓవర్ల మ్యాచ్‌పై సందేహాలు నెలకొన్నాయి. ప్రపంచకప్ ట్రోఫీ నిరీక్షణకు తెరదించేందుకు ఎదురుచూస్తున్న భారత్, దక్షిణాఫ్రికా జట్లకు వర్షం షాకిచ్చేలా ఉంది. ఇప్పటికే లీగ్ దశ మ్యాచ్‌లకు పలు దఫాలు అంత రాయం కలిగించి.. కొన్ని మ్యాచ్‌లను రద్దయ్యాయి. ముంబయిలో ఫైనల్ జరిగేరోజు 25 శాతం వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. రాత్రి 8 గంటల వరకూ కూడా వర్ష సూచన 20 శాతంగా ఉందని, ఒకవేళ వర్షం కారణంగా కనీసం 20 ఓవర్ల ఆట కూడా సాధ్యం కానిపక్షంలో రిజర్వ్ డే రోజు(సోమవారం)న ఫైనల్ ఆడిస్తారు.

ఫైనల్‌కు రిజర్వ్ డే

- వర్షం కారణంగా ఆటకు అంతరాయం ఏర్పడితే.. ఓవర్లను కుదిస్తారు. అప్పటికీ కూడా ఆట సాధ్యపడకుంటే రిజర్వ్ డేన 50 ఓవర్ల మ్యాచ్ నిర్వహిస్తారు.
- తొలిరోజు మ్యాచ్ ఎక్కడ నిలిస్తే అక్కడ నుంచి మరుసటి రోజు ఆట కొనసాగనుంది. రిజర్వ్ డేన కూడా వర్షం పడితే కనీసం 20 ఓవర్లకు కేటాయించి ఫలితం రాబడుతారు.
- ఒకవేళ రిజర్వ్ డేన కూడా వర్షం పడి ఆట సాధ్యపడకుంటే.. ఇరుజట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

జట్లు(అంచనా)..

ఇండియా మహిళలు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), షెఫాలీ, మంధాన, రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోస్ (వికెట్ కీపర్), అమన్‌జ్యోత్, క్రాంతి గాడ్, శ్రీచరణి, రేణుకా సింగ్, రాధా/స్నేహ్ రాణా.

దక్షిణాఫ్రికా మహిళలు: వోల్వార్డ్(కెప్టెన్), బ్రిట్స్, బోట్చ్, లూస్, కాప్, జోఫ్తా(వికెట్ కీపర్), డెర్క్‌సెన్, ట్రయాన్, డి-క్లెర్క్, ఖాకా, మ్లాబా.

ప్రొఫెషనల్ టెన్నిస్‌కు రోహన్ బొపన్న గుడ్‌బై

రెండు దశాబ్దాల కెరీర్ ముగిసిందంటూ ప్రకటన



ముంబయి: భారత టెన్నిస్ లెజెండ్ రోహన్ బొపన్న(45) ప్రొఫెషనల్ టెన్నిస్‌కు గుడ్‌బై చెప్పాడు. శనివారం సామాజిక మాధ్యమాల్లో తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని బొప్పన్న ప్రకటించాడు. రెండుసార్లు పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కొట్టిన ఏకైక భారత టెన్నిస్ ప్లేయర్ బొప్పన్న మాత్రమే. భారత టెన్నిస్‌పై చెరగని ముద్ర వేసిన బొపన్న రెండు దశాబ్దాలకుపైగా టెన్నిస్ కెరీర్‌ను కొనసాగించాడు. చివరి మ్యాచ్ పారిస్ మాస్టర్స్ 1000లో అలెగ్జాండర్ బుబ్లిక్‌తో కలిసి డబుల్స్ ఆడాడు. దీర్ఘకాలం గాయాల బారిన పడినా.. 2020 నుంచి మరింత ఉత్సాహంతో బొపన్న కోర్టు బరిలో దిగాడు. 43ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ 2024 డబుల్స్ విజేతగా నిలిచి సంచలనం సృష్టించాడు. దీంతో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందుకున్నాడు. అతిపెద్ద వయసులో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన తొలి టెన్నిస్ ప్లేయర్‌గా.. 43ఏళ్ల వయసులో డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలిచి అప్పట్లోనే రికార్డుపుటల్లోకెక్కాడు.

2017 ఫ్రెంచ్ ఓపెన్‌లో గాబ్రియల్ డబ్రోస్కీ (కెనడా)తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ దక్కించుకున్నాడు. రెండు సార్లు (2010, 2023) యుఎస్ ఓపెన్‌లోనే రన్నరప్‌గా నిలిచాడు. టూర్ స్థాయి డబుల్స్ టైటిళ్లు 26 నెగ్గాడు. ఎటిపి మాస్టర్స్ 1000 టైటిళ్లు ఆరు గెలిచాడు. అతడి సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2019లో అర్జున అవార్డు, 2024లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68